# ప్రభుత్వ బడిలో ఏఐ ల్యాబ్ ..!

**-తాండూరు పట్టణంలోని సాయిపూర్ పాఠశాలలో ప్రారంభం**

**తాండూరు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా ఎఫ్ఎల్ఎన్లో విద్యార్థులకు భాష, గణిత సామర్థ్యాలను పెంచేందుకు ఏర్పాటుచేసిన ఏఐ ల్యాబ్‌ను తాండూరు పట్టణంలోని ప్రభుత్వబడుల్లో ఏర్పాటుచేస్తున్నారు. ఇందులోభాగంగా సోమవారం తాండూరు పట్టణంలోని సాయిపూర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏఎంఒ రామ్ మస్త ఏఐల్యాబ్‌ను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటయ్యగౌడ్ పాల్గొని మాట్లాడుతూ.. ఏఐ ల్యాబ్ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని అన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ఎఫ్ఎల్ఎన్ ద్వారా సామర్థ్యాలు మెరుగుపడుతాయని తెలిపారు. ఈకార్యక్రమంలో సిఆర్పి వెంకటమ్మ, హెచ్ఎం నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు హరీష్‌కుమార్, ప్రభులింగంగౌడ్, విద్యారాణి, సంధ్యారాణి, రాములు, ఐఈఆర్పీ గంగం, విద్యార్థులు పాల్గొన్నారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

# భారత్ క్రికెట్ జట్టు గెలుపుపై హర్షం

**నందిగామ, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**

దుబాయ్‌లో భారత్, పాకిస్తాన్ మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో టీమిండియా జట్టు విజయం సాధించడంపట్ల నందిగామ విక్టరీ స్పోర్ట్స్ క్లబ్ మేనేజర్లు హర్షం వ్యక్తంచేశారు. ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో పాకిస్తాన్ జట్టుపై టీమిండియా జట్టు గెలుపొందడం అభినందనీయమని నందిగామ విక్టరీ స్పోర్ట్స్ క్లబ్ మేనేజర్లు ఉప్పల శ్రీనివాస్‌గుప్త, ఆర్ రఘునందన్‌రెడ్డి, బి.కృష్ణ యాదవ్, బి.లింగంగౌడ్‌లు పేర్కొన్నారు. పాకిస్తాన్‌జట్టుపై టీమిండియా గెలుపొందడం చారిత్రాత్మకమని సిడితండ సర్పంచ్ జటావత్ రాజునాయక్, తాటిగడ్డ తండా కాంగ్రెస్ నాయకుడు జటావత్ లక్ష్మణ్‌నాయక్, సోమ్లానాయక్, రంగాపూర్ నవపేట్ రాజశేఖర్‌గౌడ్, సిడితండ కారోబార్ శ్రీనునాయక్‌లు హర్షం వ్యక్తంచేశారు.

# కాంగ్రెస్ కార్యకర్తను పలకరించిన స్పీకర్



స్పీకర్ గడ్డం ప్రసాద్‌తో గోపాల్‌రెడ్డి

**షాద్‌నగర్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**

రావయ్య గోపాల్ అంటూ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కాంగ్రెస్ కార్యకర్త గోపాల్‌రెడ్డిని ఆప్యాయంగా పలకరించారు. ఫరూఖ్‌నగర్ మండలం అయ్యవారిపల్లి గ్రామానికిచెందిన గోపాల్ రెడ్డిని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు పరిచయంచేసి గోపాల్‌రెడ్డి చేస్తున్న సామాజిక సేవాకార్యక్రమాల గురించి వివరించారు. ఈసందర్భంగా గోపాల్‌రెడ్డిని చూసి స్పీకర్ ఇటు రావయ్య గోపాల్ అంటూ ఆత్మీయంగా పలకరించారు. ఈసందర్భంగా స్పీకర్‌తో కలిసి ఎమ్మెల్యే శంకర్, తదితరులు ఓజ్ఞాపకంగా ఫొటో తీసుకున్నారు.

# ప్రధానమంత్రి ప్రసంగాన్ని వీక్షించిన రైతులు



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పిఎం ప్రసంగాన్ని వీక్షిస్తున్న అధికారులు, రైతులు

**కొడంగల్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**

ప్రధానమంత్రి ప్రసంగాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులు వీక్షించారు. సోమవారం మండల పరిధిలోని పర్సాపూర్‌గ్రామ రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులు వీక్షించారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద రైతులకు 19వ విడత ఆర్థిక సహాయాన్ని ప్రధాని నరేంద్రమోదీ బీహార్‌లోని భాగల్పూర్‌లో జరిగిన కార్యక్రమంలో విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని కొడంగల్ మండల పరిధిలోని పర్సాపూర్ రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాఖ సిబ్బందితో పాటు అధిక సంఖ్యలో రైతులు పాల్గొని వీక్షించారు. కార్యక్రమంలో కొడంగల్ ఏడిఏ శంకర్‌రాథోడ్, బొంరాస్‌పేట్ ఏఓ తులసి, దుద్యాల్ ఏఓ హిమబిందు, దౌల్తాబాద్ ఏఓ లావణ్య, ఏఈఓలు పాల్గొన్నారు.

# ధ్వజారోహణ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి



స్ఫటికలింగేశ్వరాలయ బ్రహ్మోత్సవ వేడుకల్లో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

**ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**

పోచారం శ్రీస్ఫటికలింగేశ్వరాలయంలో సోమవారం ధ్వజారోహణ కార్యక్రమంతో శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయవార్షికోత్సవ వేడుకలతోపాటు శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొని ధ్వజారోహణ పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేకు శాలువాకప్పి సత్కరించారు. ఈకార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు చెర్కుసరితాబద్రీనారాయణగౌడ్ దంపతులు, మాజీ కౌన్సిలర్లు మెట్టు బాల్‌రెడ్డి, సింగిరెడ్డి సాయిరెడ్డి, నాయకులు మందాడి సురేందర్‌రెడ్డి, నల్లవెల్లి శేఖర్ ముదిరాజ్, సామల బుచ్చిరెడ్డి, బద్దం జగన్‌మోహన్‌రెడ్డి, నర్రీకాశయ్య, బద్దం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విజిలెన్స్ భయం .!

## -మున్సిపల్ అధికారుల్లో వణుకు..



మున్సిపల్ కార్యాలయంలో విజిలెన్స్ అధికారుల విచారణ

**తాండూరు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**

వికారాబాద్ జిల్లా తాండూరు మున్సిపల్ కార్యాలయంలోని ఇంజనీరింగ్ శాఖ అధికారుల్లో విజిలెన్స్ భయం కనిపిస్తుంది. మున్సిపల్ నూతన కార్యాలయ భవననిర్మాణంలో నిధుల దుర్వినియోగం జరిగిందంటూ విజిలెన్స్ అధికారు లకు ఫిర్యాదు అందడంతో మూడురోజులక్రితం తాండూరు మున్సిపల్ కార్యా లయంలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించిన విషయం తెలిసిందే. అధికారులు మున్సిపల్ అవినీతి, అక్రమాలపై లోతుగానే విచారణ చేపట్టినట్లు తెలుస్తుంది. దీంతో మున్సిపల్ అధికారుల్లో వణుకు ప్రారంభమైంది. విజిలెన్స్ విచారణతో ఎప్పుడు ఎటునుండి ఏంముంచుకొస్తుందోనని భయంనెలకొంది. మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు గతంలో చేపట్టిన పనులకు సంబంధించి ఫైళ్లు, ఎంబీలను తిరగేసేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు కార్యాలయం లో గుసగుసలు వినిపిస్తున్నాయి. 2020 సంవత్సరంలో సుమారు రూ.3కోట్ల 47లక్షల నిధులతో నూతన మున్సిపల్ కార్యాలయం భవనాన్ని నిర్మించారు. 2021లో కొత్త భవనాన్ని ప్రారంభించారు. అయితే, మున్సిపల్ నూతన కార్యాలయ ప్రారంభసమయంలో రూ.76లక్షల అదనపునిధులతో వివిధ అభి వృద్ధిపనులను చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం భవననిర్మాణంలో అధికా రులు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారంటూ సంబంధిత అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలంటూ గతంలో మున్సిపల్ పాలకవర్గానికిచెందిన పలువురు కౌన్సిలర్లు మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులపై మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులతోపాటు రాష్ట్ర విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులకు ఫిర్యాదుచేశారు. ఐదేళ్లతరువాత కేసు తెరపైకి రావడంతో అధికారుల్లో అలజడి మొదలైంది. ఎవరిపై వేటు పడుతుందోనని భయం పట్టుకుంది. అయితే, ఈకేసులో ఓ ఉన్నతాధికారితోపాటు ఇద్దరు ఇంజనీరింగ్ అధికారుల మెడకు ఉచ్చు బిగుస్తుందని పుకార్లు వినిపిస్తున్నాయి.



కీసరగుట్టలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లు





భక్తులకు సమాచారాన్ని అందిచనున్న కీసరవాణి



భక్తుల కోసం తయ్యారైన లడ్డూలు

# మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన కీసరగుట్ట

**-భక్తులకు క్యూలైన్లు,చలువ పందిళ్లు ఏర్పాటు**
**-బ్రహ్మోత్సవాలకు 285 ఆర్‌టిసి బస్సులు**
**-భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి**

**కీసర, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**

తెలంగాణాలోనే సుప్రసిద్ధ శైవక్షేత్రమైన కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వరస్వామి దేవాలయం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. నగరానికి చేరువలో ఉన్న కీసరగుట్ట బ్రహ్మోత్సవాలలో ప్రముఖులతోపాటు లక్షలాదిమందిభక్తులు పాల్గొనే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తిచేసింది. బ్రహ్మోత్సవాలు జరిగే ఆరురోజులు శ్రీరామలింగేశ్వరస్వామి సన్నిధిలో పూజలు, అభిషేకాలు భారీగా జరుగనున్నాయి. జిల్లా అదనపుకలెక్టర్ విజయేందర్‌రెడ్డి, ఆర్‌డిఓ వెంకట ఉపేందర్‌రెడ్డిలు జాతరలో సమన్వయంతో పనిచేసేలా వివిధశాఖల అధికారులను సమాయత్తం చేస్తున్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు మార్చి 1వతేదీవరకు కొనసాగనున్నాయి. గతసంవత్సరం బ్రహ్మోత్సవాల్లో జరిగిన లోటుపాట్లను సవరించుకుంటూ ఈసారి భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఈసారి బ్రహ్మోత్సవాలకు సుమారు 6లక్షలమంది భక్తులు స్వామివారిని దర్శనం చేసుకునే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

**భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి...**

కీసరగుట్ట పరిసరాలతోపాటు ప్రధాన ఆలయం, ఆంజనేయస్వామి విగ్రహానికి, మహామండపానికి రంగులువేసి పనులను పూర్తిచేశారు. రోడ్డు పక్కన హుడాపార్కు నుంచి ఉత్తరద్వారం గుండా స్వామి వారి దర్శనానికి క్యూలైన్లు, భక్తులు సేదతీరడానికి ఆంజనేయస్వామి ఆలయం పరిసర ప్రాంతాల్లో చలువపందిళ్లు ఏర్పాటుచేశారు. ఆరురోజులపాటు జరిగే బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు జాతరజరిగే ప్రాంతాల్లో నిరంతరంగా మంచినీటిసరఫరా కోసం పైప్‌లైన్, కుళాయిలు, మినీవాటర్ ట్యాంకుల వద్ద మరమ్మతులు, ఆన్ ఆఫ్‌లను బిగించే పనులు పూర్తిచేశారు. కీసరగుట్ట జాతరకు సంబంధించిన సమాచారాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయడంతో పాటు జాతరలో తప్పిపోయినవారి సమాచారాన్ని చేరవేసేందుకు కీసరవాణిని కూడా సిద్ధం చేశారు. బ్రహ్మోత్సవాల్లో స్వామివారి విఐపి దర్శనం, అభిషేకం, కళ్యాణం తదితరసేవల కోసం ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ భక్తులకు అందుబాటులోకి తెచ్చారు. భక్తులు ప్రీతికరంగా భావించే లడ్డూ ప్రసాదాల తయారీ చేపట్టారు. మొదటి విడతగా లక్షవరకు లడ్డూ, వడ ప్రసాదాలు సిద్ధం చేశారు. జాతరజరిగే ప్రాంతాల్లో అదనంగా సింటెక్స్ ట్యాంకులను ఏర్పాటుచేశారు. గతంలో ఏర్పాటు చేసిన మరుగుదొడ్లను మరమ్మతులు చేపట్టి మరిన్ని తాత్కాలికంగా 150 మరుగుదొడ్లు, 100 సాన్నాలగదులు సిద్ధంచేశారు. పారిశుధ్య సిబ్బంది ఇదివరకే తమవిధులను ప్రారంభించారు. వేయి మందికి పైగా మున్సిపాలిటీ, పంచాయతీ, జిహెచ్ఎంసి పారిశుధ్య సిబ్బంది జాతరలో విధులు నిర్వహిస్తున్నారు. విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ మరమ్మతులు నిర్వహిస్తున్నారు. నిరంతర విద్యుత్‌సరఫరా కోసం అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేసి అత్యవసర సమయంలో వినియోగించేందుకు జనరేటర్లను ఉంచనున్నారు. విశాలమైన మైదానంలో వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లుచేస్తున్నారు. బ్రహ్మోత్సవాలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లుచేస్తున్న రాచకొండ పోలీసులు ఐదు ప్రాంతాల్లో పోలీస్ ఔట్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ ఆవరణతోపాటు జాతరజరిగే అన్నిప్రాంతాల్లో సిసికెమెరాలను ఏర్పాటు చేశారు.

**కీసరగుట్టకు 285 ఆర్‌టిసి బస్సులు...**

కీసరగుట్ట మహాశివరాత్రిబ్రహ్మోత్సవాలకు నగరంలోని అన్నిడిపోలనుండి 285 ఆర్‌టిసి బస్సులను నడుపనున్నట్లు కుషాయిగూడ డిపో మేనేజర్ మహేష్‌కుమార్ తెలిపారు. ఈబస్సులు ఈసిఐఎల్, అఫ్జల్‌గంజ్, తార్నాక, సికింద్రాబాద్, లాలాపేట్, మౌలాలి, హౌసింగ్‌బోర్డు, ఉప్పల్, ఘట్‌కేసర్‌లనుండి నడుపుతున్నట్లు తెలిపారు. ఒక్క రోజుకు నగరంలోని అన్ని డిపోల బస్సులు 100ట్రిప్పులను నడుపనున్నట్లు తెలిపారు. ఈ బస్సులన్నీ కీసరగుట్ట బస్టాండ్‌వరకు నడుస్తాయని అన్నారు. భక్తులు దర్శనంచేసుకున్న తరువాత తిరుగుప్రయాణంలో బస్సులు బస్టాండ్‌లో ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రయాణికులకు అనుగుణంగా కీసరగుట్ట బస్టాండ్‌ను తీర్చిదిద్దామన్నారు. కావున సురక్షిత ప్రయాణంకోసం ప్రయాణికులందరూ ఆర్‌టిసిబస్సులలో ప్రయాణం చేయాలని డిపోమేనేజర్ కోరారు.

# విద్యార్థులకు విద్యతోనే భవిష్యత్

**-మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్**



పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ గౌతమ్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**

విద్యార్థులకు విద్యతోనే భవిషత్ ఉంటుందని,కష్టపడి చదివి లక్ష్యాన్ని సాధించాలని, ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణ, చేయూత, కృషి అవసరమని మేడ్చల్‌జిల్లా కలెక్టర్ గౌతమ్ సూచించారు. పదవతరగతి తరువాత విద్యార్థులు ఏదిశగా వెళ్లాలనే అంశంపై క్షుణ్ణంగా అర్థమయ్యేలా మార్గనిర్దేశం చేసి వారి భవిషత్‌కు చేయూతనందించాలని అన్నిపాఠశాలల ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సోమవారం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాపరిధిలోని కూకట్‌పల్లి మండలంలోని ఎల్లమ్మబండ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలను జిల్లాకలెక్టర్ సందర్శించి తనిఖీచేశారు. ఈసందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ విద్యార్థులు పదవతరగతి తరువాత ఏ కోర్సు తీసుకోవాలనే విషయంపై అన్నిపాఠశాలల ప్రధానోపాధ్యాయులు తగుచర్యలు తీసుకోవాలన్నారు. ఉత్తమమార్కులు సాధించి విద్యార్థులు మంచి కోర్సులను ఎంచుకుని మంచి భవిషత్‌లు ఏర్పాటుచేసుకునేలా చూడాలని కలెక్టర్ సూచించారు. కృషి, పట్టుదల, క్రమశిక్షణతో పదవతరగతిలో విజయం సాధించాలని, భవిషత్‌లో ఏమిచదవాలన్నదాన్ని లక్ష్యంగా పెట్టుకొని ఆదిశగా ముందుకుసాగాలన్నారు. పదవతరగతి విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించారు. భవిషత్‌లో ఏమిచదువుతారని, ఏకోర్సులు ఏగ్రూపులు తీసుకుంటారని, విద్యార్థులను అడిగితెలుసుకున్నారు. కష్టపడిచదివి మంచిమార్కులు సాధించాలని కలెక్టర్ సూచించారు. స్కూల్‌లో వసతులు, భోజనం ఎలా ఉంటుందని, రివిజన్ ఎలాకొనసాగుతుందని అడిగితెలుసుకున్నారు. దీనికిముందుగా రాష్ట్రవిద్యాశాఖద్వారా అందజేసే ఎఫ్ఎల్ఎన్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ టూల్ ద్వారా. పాఠశాలలో భాష, గణిత సామర్థ్యాలలో వెనకబడిన విద్యార్థులను ప్రత్యేకంగా గుర్తించి ప్రత్యేకమైన టూల్ ద్వారా విద్యార్థులలో సామర్థ్యాలను పెంపొందించే ల్యాబ్‌ను కలెక్టర్ ప్రారభించారు. ప్రతి విద్యార్థి 20నిమిషాలు నిడివితో పాఠాలు వినాలని, తప్పనిసరిగా నాలుగురోజులు హాజరు ఉండేలా ఉపాధ్యాయులు శ్రద్ధతీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్యాంప్రకాశ్, తహసీల్దార్ స్వామి, డిఇఓ విజయకుమారి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ గోడాములో అగ్నిప్రమాదం



ప్లాస్టిక్ గోదాములో చెలరేగుతున్న మంటలు

**మేడ్చల్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని ప్లాస్టిక్ గోదాములో అగ్నిప్రమాదం చెలరేగి ఆస్తినష్టం చోటుచేసుకుంది. గుండ్లపోచంపల్లిలోని అపెరల్ పార్కువద్ద ఓ గోదాములో గత నాలుగునెలలుగా ప్లాస్టిక్ పాతసామానును నిలువ ఉంచుతున్నారు. సోమవారం మధ్యాహ్నం ఆగోదాములో అకస్మాత్తుగా మంటలు అంటుకుని చెలరేగడంతో దట్టమైనపొగతో మంటలు అంతటా వ్యాపించాయి. ప్లాస్టిక్‌వస్తువులు పూర్తిగా అంటుకుని మంటలు ఎగిసిపడ్డాయి. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చినా అప్పటికే ప్లాస్టిక్ మొత్తం కాలిపోయింది. ఈమంటల్లో రూ.సుమారు 20లక్షలవరకు ఆస్తినష్టం జరిగి ఉంటుందని, షార్ట్‌సర్క్యూట్‌తో మంటలంటుకుని ఉంటాయని అనుమానం వ్యక్తంచేస్తున్నారు.

# భూములు ఇచ్చిన రైతులకు నష్టపరిహారం

**-జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్**

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 24: ప్రభాతవార్త:**

పారిశ్రామిక పార్కుకు భూములు ఇచ్చిన రైతులకు నష్టపరిహార చెక్కులను పంపిణీ చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో కొడంగల్ నియోజకవర్గం, దుద్యాలమండలం, హకీంపేటకుచెందిన రైతులకు నష్టపరిహార చెక్కులను తాండూర్ సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్‌తో కలిసి జిల్లా కలెక్టర్ అందజేశారు. ఈసందర్భంగా రైతులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, భూములు కోల్పోయిన రైతులు ప్రభుత్వం అందజేసిన నష్టపరిహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. నష్టపరిహారంపొందిన రైతులు వారికుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధిచెందేందుకు ఈడబ్బులను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. దుద్యాలమండలం, హకీంపేటలో 93.16ఎకరాలభూమిని బహుళార్థసాధక పారిశ్రామికపార్కుకు 62మందిరైతులు తమభూములను కేటాయించేందుకు సమ్మతితెలిపారని పేర్కొన్నారు. పారిశ్రామికపార్కుకు భూములనుకేటాయించిన రైతులకు నష్టపరిహార చెక్కులను అందజేయడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, టిజిఐఐసి జోనల్ మేనేజర్ ఓవిటి శారద, అసిస్టెంట్ జాయింట్‌మేనేజర్ అజీమాసుల్తానా, గ్రంథాలయసంస్థ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, దుద్యాల తహసీల్దార్ కిషన్, హకీంపేట రైతులు పాల్గొన్నారు.



రైతులకు చెక్కులను అందజేస్తున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

# అనుమానస్పదంగా మహిళ మృతి

**మర్పల్లి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**

అనుమానస్పదంగా ఓమహిళ మృతిచెందిన సంఘటన మర్పల్లి మండలంలోని కోటమర్పల్లి గ్రామంలో సోమావారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన కథనంప్రకారం, కోటమర్పల్లి గ్రామానికి చెందిన తోకల వినోదమ్మ(63)కి ఇద్దరు కూతుర్లు విమలమ్మ, జ్యోతి. విమలమ్మను సంగారెడ్డిజిల్లా పటాన్‌చెరు మండలంలోని లక్డారం గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహం జరిపించి, రెండో కూతురు జ్యోతికి స్వగ్రామానికి చెందిన వ్యక్తితో వివాహం జరిపించింది. కొన్ని రోజులుగా వినోదమ్మ తమ ఇంటివద్ద కొన్ని రోజులు కొన్ని రోజులు తమ కూతుళ్ల ఇంటివద్ద ఉండేదని సమాచారం. రోజుమదిరిగానే ఆదివారం అమె ఇంటివద్ద ఉంది. సోమావారం 8గంటలు అయినా వినోదమ్మ తలుపులు తెరుచుకోకపోవడంతో ఇరుగుపొరుగు వారు గమనించి తలుపులు తొలగించి చూడగా బీరువా నుండి పొగలు రావడం గమనించారు. వినోదమ్మ కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతకగా ఇంట్లో ఉన్నబావిలో మృతదేహాన్ని గుర్తించారు. ఈవిషయన్ని గ్రామస్థులు మర్పల్లి పోలీసులకు సమాచారం ఇవ్వగా, పోలీసులు అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు. కొడుకులు లేకపోవడంతో మృతురాలు గ్రామంలో ఒంటరిగా నివాసం ఉండేదని మెడలోని బంగారం గుండ్లు ఇతర వస్తువులు దొంగతనం చేసి ఆమెను హత్యచేసి బావిలో పడేసారని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చెయ్యగా మోమిన్‌పేట్ సి.ఐ. నవీన్‌గౌడ్, ఎస్.ఐ. ఆరవింద్, మర్పల్లి ట్రైనింగ్ ఎస్.ఐ. పుండ్లక్ ఉదయమే సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకొని వికారాబాద్ డి.ఎస్.పి. శ్రీనివాస్‌రెడ్డికి వివరించారు. బావిలోనుండి మృతుదేహాన్ని వెలికితీసి డాగ్ స్క్వాడ్‌ని క్లూస్‌టీం సిబ్బంది, మర్పల్లి ప్రభుత్వడాక్టర్‌ను రప్పించి అవసరమైన గుర్తింపులను సేకరించారు. ఇది ఇలా ఉండగా డాగ్ మృతురాలి ఇంటినుండి మర్పల్లి రోడ్డుపైనుండి మర్పల్లి శివారులో ఉన్న జామతోట దగ్గర అగిపోవడంతో గ్రామస్థులు పలురకాలుగా చర్చించుకుంటున్నారు. పోలీసులు ఆనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**-జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్**



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

**వికారాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపుకలెక్టర్ లింగ్యానాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం హాలులో ఏర్పాటుచేసిన ప్రజావాణి సందర్భంగా జిల్లాలో వివిధప్రాంతాలనుండి వచ్చినప్రజలు 109 ఫిర్యాదులు సమర్పించారని, వాటిలో భూసమస్యలు, ఆసరాపెన్షన్లు, ఇరిగేషన్, భూసర్వే ఇతర సమస్యలకు సంబంధించి దరఖాస్తులు వచ్చాయనితెలిపారు. భూసమస్యలపై ఫిర్యాదులను పరిశీలించారు. ఫీల్డ్‌వెరిఫికేషన్ పూర్తిచేసి రిపోర్ట్ పంపించాలని, ప్రజావాణిద్వారా వచ్చిన ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపుకలెక్టర్ (స్థానికసంస్థలు) సుధీర్, ఆర్డీఓ వాసుచంద్ర, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కారు బైక్ ఢీ, ఇద్దరికి గాయాలు

**మర్పల్లి ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:**

మర్పల్లి మండలంలోని పట్లూర్ గ్రామం వద్ద కారు బైక్ ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలు అయిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పట్లూర్ గ్రామానికి చెందిన మొముల మోష కుటుంబీకులు బంధు వర్గాలతో బుదేరాకు వెళ్తుండగా, బుదేరా నుండి మర్పల్లి మండలంలోని బుచన్‌పల్లి గ్రామానికి చెందిన రమేష్ తనకారులో వస్తుండగా పట్లూర్ వెంచర్ సమీపంలో మోష వారి సమీప బంధువు కారింపుర్ గ్రామానికి చెందిన ప్రభు బైక్‌ను కారు బలంగా ఢీకొనడంతో బైక్‌పై ఉన్న వారికి తీవ్ర గాయాలు కావడంతో అదే కారులో సంగారెడ్డిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

# గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

**భారీ శబ్దంతో..భయాందోళనలు**

**పోతాయిపల్లిలో జరిగిన సంఘటనలో తప్పిన పెను ప్రమాదం**

**శామీర్‌పేట, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** పోతాయిపల్లి గ్రామంలో ఓ ఇంట్లో వంట గ్యాస్ సిలిండర్ పేలి భారీ శబ్దం సంభవించటంతో పాటు భారీ మంటలు చెలరేగి ఇళ్లు దగ్ధమైంది. సోమవారం రాత్రి శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ పరిధిలోని పోతాయిపల్లిలో ఈ సంఘటన చోటు చేసుకుంది. శామీర్‌పేట పోలీసుల కథనం ప్రకారం పోతాయిపల్లి గ్రామంలోని మహంకాలి టెంపుల్ దగ్గర గల తీగుళ్ల గోపాల్ రేకుల ఇంట్లో అద్దెకు ఉంటున్న ముగ్గురు బీహార్‌కు చెందిన వారు టీ కాచుకునే క్రమంలో ఒక్కసారిగ గ్యాస్ సిలిండర్ పేలి పెద్ద శబ్దం వచ్చి పేలిపోవటంతో ఏర్పడిన మంటలు అంటుకుని ఇళ్లు దగ్ధం అయి రేకులు కింద పడిపోవటం జరిగింది. అయితే ఈ సంఘటనలో ఎలాంటి ఎవరికి కూడ ప్రాణహానీ, గాయాలు కాలేదని అన్నారు. రేకుల ఇళ్లు కావటంతో పెద్దగా ఆస్తినష్టం కూడ అంతగా కాలేదన్నారు. శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇదీ ఇలా ఉండగ అయితే అక్కడ ఉన్న కొన్ని సిలిండర్స్‌ను బట్టి పరిశీలిస్తే వంట గ్యాస్ రిఫిలింగ్ చేస్తుండగ ఈ ప్రమాదం జరిగినట్లు పలువురు భావిస్తున్నారు. ఈ సంఘటన జరిగినప్పటికీ పెను ప్రమాదం తప్పినట్లు చెప్పవచ్చు. వంటగ్యాస్ పేలుడు సంఘటన గ్రామ ప్రజలందరు భయాందోళనకు గురయ్యారు. ఎలాంటి ప్రాణనష్టం, గాయాలు కాకపోవటంతో అంత ఊపిరిపీల్చుకున్నట్లు చెప్పవచ్చు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి : ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 24,ప్రభాతవార్త:** పట్టణంలోని ఆర్టీసి బస్టాండ్ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని డిపో బాధ్యులకు ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని బస్టాండ్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి బస్టాండ్ బాధ్యులకు పలు సూచనలు చేశారు. వేసవి కాలం కావడంతో ఎండల మండుతుంటాయని, తాగునీటి కొరకు ప్రయాణీలకు అవస్థలు పడకుండా తగు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తాజీ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, ఆర్టీసి సిబ్బంది పాండు తదితరులు ఉన్నారు.

## ఆచార్యలో క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డి, సిఐ శివలంగం

**జహీరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో 2025 సంవత్సర క్యాలెండర్‌ను డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డి, సిఐ శివలింగంలు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఉత్తమ పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు క్రమ శిక్షణతో కూడిన ఉన్నత విద్యను అందించాలని కళాశాల బాధ్యులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ హరికుమార్, కళాశాల డైరెక్టర్లు ఎం వెంకటరాంరెడ్డి, జి శ్రీనివాస్‌రెడ్డి, అధ్యపకులు నందు గౌడ్, నర్సింలు పాల్గొన్నారు.

## మార్కండేయ ఆలయ ప్రారంభోత్సవానికి సిఐకి ఆహ్వానం

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** పట్టణశివారులోని వెంకటా పూర్ చౌరస్తాలో నూతనంగా నిర్మించిన మార్కండేయ ఆలయ ప్రారంభోత్సవానికి హాజరు కావాలని ఆలయ కమిటీ బాధ్యులు సిఐ శ్రీనివాస్‌రెడ్డికి సోమవారం ఆహ్వాన పత్రికను అందచేశారు. మార్చి 3వ తారీఖు నుంచి 6వ తేదీ వరకు వైభవంగా ప్రారంభోత్సవ పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు, ప్రారంభోత్సవ కార్యక్రమానికి కుటుంబ సభ్యులతో కలిసి హాజరై స్వామి వారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించి పునీతులు కావాలని కమిటి బాధ్యులు సిఐకి వినతి చేశారు.

## ప్రత్యేక తరగతులను పరిశీలించిన ప్రత్యేక అధికారి



జడ్పీహెచ్‌ఎస్‌లో ప్రత్యేక తరగతులను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి

**ఝరాసంగం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎల్గోయి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను సోమవారం ప్రత్యేక అధికారి సృజన్ చక్రవర్తి పరిశీలించారు. విద్యార్థులకు ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

## రుద్రారంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ



రుద్రారంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న చైర్మన్ మచ్చేందర్

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని జిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుబ్బప మచ్చేందర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మచ్చేందర్ మాట్లాడుతూ ప్రతివ్యక్తి అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ ప్రభాకర్, గ్రామస్థులు, పాల్గొన్నారు.

## ప్రత్యేక అధికారిని సన్మానించిన అధికారులు

**చౌటకూరు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** మండల ప్రత్యేక అధికారిగా జిల్లా పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు వసంతకుమారిని నియమిస్తూ జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం మండల కేంద్రమైన చౌటకూరులోని మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్న ప్రత్యేక అధికారి వసంత కుమారిని ఎంపిడిఓ శంకర్, ఎంపిఓ శ్రీకాంత్‌లు ఘనంగాస్వాగతంపలికి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలోపంచాయితీ కార్యదర్శి సందీప్‌గౌడ్, జూనియర్ సహాయకులు ప్రీతం నాయక్ తదితరులు ఉన్నారు.



వసంత కుమారిని సన్మానిస్తున్న ఎంపిడిఓ, ఎంపిఓ

# నల్ల పోచమ్మ ఆలయానికి రూ. 27.12 లక్షల ఆదాయం

**-మడిగెల వేలం పాట వాయిదా**



కొబ్బరికాయల విక్రయం, దుకాణా సముదాయం, వాహనాల పార్కింగ్‌ల వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

**కౌడిపల్లి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** మండల పరిధిలోని తునికి గ్రామంలో వెలసిన శ్రీనల్ల పోచమ్మ ఆలయానికి సోమవారం కొబ్బరికాయలు, మడిగెలు, వాహనాల పార్కింగ్, టెంట్ సామాగ్రి అద్దెల సంబంధించి నిర్వహించిన వేలంపాటలో గత ఏడాది మడిగెలు దక్కించుకున్న టెండర్‌దార్లు రూ. 4.70 లక్షల బాకీ వసూలు కానందున వాటికి వాయిదా వేస్తూ, మిగతావాటికి వేలం వేయగా రూ. 27.12 లక్షల ఆదాయం అమ్మవారికి వచ్చినట్లు ఇన్‌చార్జి ఈవో వి.రంగారావు తెలిపారు. ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దేవాదాయ, ధర్మదాయ శాఖ ఆదేశానుసారం కూచన్‌పల్లి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం ఈవో శ్రీనివాస్ పర్యవేక్షణలో వేలంపాటలు నిర్వహించినట్లు చెప్పారు. సంవత్సరం పాట కొబ్బరి కాయల విక్రయాలకుగాను చల్లా కుమార్ రూ. 18.30 లక్షలు అదనంగా పాడి దక్కించుకోగా, టెంట సామాగ్రి అద్దెకుగాను పద్మనాభం రూ. 8.45 లక్షలు అదనం గాపాడి దక్కించుకోగా, జాతర రోజుల వరకే తునికి శ్రీనల్లపోచమ్మ ఆలయంకు ఉత్తరం, దక్షిణం దిక్కుల వాహనాల పార్కింగ్‌కు పన్యాల ఫ్రేమ్ రూ. 37 వేలకు దక్కించుకున్నట్లు ఆయన తెలిపారు. మూడు అంశాలకు సంబంధించి వేసిన టెండర్ల ద్వారా శ్రీ నల్ల పోచమ్మ ఆలయానికి అదనంగా రూ. 1.32 లక్షల ఆదాయం వచ్చిందని ఆయన చెప్పారు. గత ఏడాది నాలుగు మడిగెలకు టెండర్‌దార్లు అధిక మొత్తంలో వేలంపాటలు పాడి షాపుల దక్కించుకున్న, కొంత మేర డబ్బులు ఆలయానికి బాకీ పడినందున వారు వేసిన టెండర్లను అనర్హులుగా ప్రకటించినం దున, వేరే కొత్త టెండర్లు రానందున తిరిగి వాయిదా వేసినట్లు ఇన్‌చార్జి ఈవో వి.రంగారావు తెలిపారు. గత ఏడాదికి సంబంధించి బాకీ డబ్బులు వసూలులో అధికారులు వారం రోజుల్లో చెల్లించాలని మరోసారి మౌఖికంగా ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ఆలయం చుట్టు పక్కలగల పట్టాదారు భూ యజమాన్యులు ఆలయ అభివృద్ధిలో తమ వంతు కృషి చేసేందుకు గాను ప్రభుత్వ ధరకు విక్రయం చేయడం కాని, సంవత్సరం అద్దె రూపంలో గాని, విరాళా రూపంలోగాని ఆలయంకు ఇవ్వడానికి ముందుకు రావాలని ఇన్‌చార్జి ఈవో విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్లు వెంకట్‌రెడ్డి, రామకృష్ణా, తునికి ఆలయ మాజీ చైర్మన్లు చల్లా మల్లేశం, గోపాల్‌రెడ్డి, బండి సాయాగౌడ్, గ్రామ పెద్దలు మాణిక్యరెడ్డి, రహీం, సాయిలు, నారాయణ రెడ్డి, టెండర్‌దార్లు, ఆయ గ్రామాల నుంచి విచ్చేసిన భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# 20వ రోజుకు చేరిన డంపింగ్ యార్డు వ్యతిరేక రిలే నిరాహార దీక్షలు



డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా నిర్వహించిన ర్యాలీలో భారీగా పాల్గొన్న మహిళలు

**గుమ్మడిదల, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** మండలంలోని ప్యారానగర్‌లో జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 20వ రోజుకు చేరుకున్నాయి. స్థానిక గ్రామాల ప్రజలు, నాయకులు స్వచ్ఛందంగా ధర్నాలో పాల్గొన్నారు. గుమ్మడిదలలో పద్మశాలి సంఘం సభ్యులు నిరాహార దీక్షలో పాల్గొన్నారు. కొత్తపల్లి, నల్లవల్లి గ్రామాలలో ముదిరాజ్ సంఘం సభ్యులు దీక్షలో పాల్గొన్నారు. గుమ్మడిదలలో చిన్నారులు, మహిళలు, యువకులు స్వచ్ఛందంగా పాల్గొని గల్లీగల్లీ తిరుగుతూ డంపింగ్ యార్డ్ ఏర్పాటును వెంటనే ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని నినాదాలు చేస్తూ ఆయా గ్రామాలలో స్వచ్ఛందంగా తిరిగారు. గుమ్మడిదలలో డంపుయార్డ్ మాకు వద్దు అంటూ గులాబీల నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ అధికారులు సహకరించాలని గుమ్మడిదల మున్సిపల్ కమిషనర్ రఘు, డిప్యూటీ తహశీల్దార్ కరుణాకర్‌రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డిలకు గులాబీ పువ్వులు ఇచ్చి మాకు సహకరించాలని కోరారు. అనంతరం దీక్ష శిబిరంలో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు చిమ్ముల జైపాల్ రెడ్డి, చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మద్దుల బాల్‌రెడ్డి, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, చిమ్ముల నరసింహారెడ్డి, శ్రావణ్‌రెడ్డి, సూర్యనారాయణ, సంజీవ రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, చంద్రారెడ్డి, జైపాల్‌రెడ్డి, తుపాకుల రాజు, భరత్, ఆకుల ఆంజనేయులు, ఆకుల సత్యనారాయణ, సదానందరెడ్డి, రవీందర్‌రెడ్డి, భిక్షపతిరెడ్డి, బొడ్డు చంద్రశేఖర్, భిక్షపతి, బాలిశెట్టి, నల్లవల్లి గ్రామ ప్రజలు, ముదిరాజ్ సంఘం నాయకులు కోర్వి శంకర్, తలరి వెంకటేష్, బొడ్డు మహేష్, రాజబోయిన సత్యనారాయణ, తలారి శోభన్, గాండ్ల శ్రీశైలం, కోర్వి పోషాలు, గాండ్ల బద్రి, సందె నబోయిన శంకరయ్య, బొమ్మనిబోయిన శంకర్, జేఏసీ నాయకులు, సభ్యులు, ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మహా శివరాత్రి ఉత్సవాలకు ఉమా సంగమేశ్వరాలయం ముస్తాబు

**నాలుగు రోజుల పాటు జరగనున్న జాతర ఉత్సవాలు**

**పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** మహా శివరాత్రి జాతర ఉత్సవాలకు మండల పరిధిలోని కొప్పోల్ ఉమా సంగమేశ్వర దేవాలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఈ నెల 25వ తేదీ నుండి 28వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామి వారిని దర్శించుకుంటారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. అదేవిధంగా జాతర ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు.

**మహా శివరాత్రి ఉత్సవాలు...**

కొప్పోల్ దేవాలయంలో నాలుగు రోజుల పాటు మహా శివరాత్రి ఉత్సవాలను కన్నుల పండుగగా నిర్వహిస్తారు. 25వ తేదీ మంగళవారం పుణ్య హవచనం, 26న బుధవారం రుద్రాభిషేకంతోపాటు అర్ధరాత్రి లింగోద్భవ కాలంలో రుద్రాభిషేకం, 27న గురువారం స్వామి కళ్యాణోత్సవంతో పాటు సాయంత్రం శకట భ్రమనోత్సవం, 28న శుక్ర వారం పూర్ణాహుతితో పాటు రథోత్సవ కార్యక్రమం తో జాతర ఉత్సవాలు ముగుస్తాయి.

**ఆర్టీసీ ప్రత్యేక బస్సులు...**

జాతర ఉత్సవాల సందర్భంగా ఆర్టీసీ నారాయణ ఖేడ్ డిపో పెద్దశంకరంపేట బస్టాండ్ నుండి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచించారు.



ఉమా సంగమేశ్వరాలయంలో వెలసిన స్వయంభు లింగం

**కట్టుదిట్టమైన భద్రత...**

జాతర జరిగే నాలుగు రోజులపాటు పటిష్ట బందోబస్తులు ఏర్పాట్లు చేస్తున్నట్లు పెద్దశంకరంపేట ఎస్‌ఐ శంకర్ తెలిపారు. జాతరలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పోలీసులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు.



## ఎరువుల దుకాణాదారులు నిబంధన ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**జిల్లా వ్యవసాయ అధికారి విన్సెంట్ వినయ్‌కుమార్**

**నర్సాపూర్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త :** విత్తన ఎరువుల దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి విన్సెంట్ వినయ్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం నర్సాపూర్ మండలంలోని విత్తన, ఎరువులు పురుగు మందుల దుకాణాలను ఆయన తనిఖీలు నిర్వహించారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన ఎరువుల దుకాణాల యజమానులు లైసెన్సు కలిగి ఉండాలని, ఎరువులు పిఓఎస్ మెషీన్ ద్వారానే ఎమ్ఆర్‌పి ధరలకే విక్రయించాలన్నారు. డీలర్లు ఎప్పటికప్పుడు వ్యవసాయ శాఖ వారికి రిపోర్టులు అందజేయాలని, స్టాక్ రిజిస్టర్లు రోజు వారీ అప్డేట్ చేయాలని ఆదేశించారు. విక్రయాలలో డీలర్లు నిభందనలు ఉల్లంఘిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ఈ సమయంలో జిల్లా వ్యవసాయ అధికారి విన్సెంట్ వినయ్ కుమార్ తో పాటు మండల వ్యవసాయ అధికారిణి దీపిక పాల్గొన్నారు.

## నర్సాపూర్ పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రారంభం

**నర్సాపూర్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త :** విద్యార్థుల్లో కనీస అభ్యాసన సామర్థం పెంచేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగపడుతుందని ఎంఈఓ తారాసింగ్ అన్నారు. సోమవారం నర్సాపూంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల 2లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని ఎంఈవో తారాసింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ తారా సింగ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక స్థాయిలో చదువుతున్న విద్యార్థులకు ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ మేరకు మెదక్ జిల్లాలో ఆరు ప్రాథమిక పాఠశాలను ఎంపిక చేశారు అన్నారు. ఇందులో భాగంగా నర్సాపూర్ లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల 2 లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ తారా సింగ్ తో పాటు కాంప్లెక్స్ హెచ్ఎం చంద్రశేఖర్, పాఠశాల హెచ్ఎం మక్సూద్ అలీ, సీఆర్పీలు సుజాత భైరవరెడ్డి. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని ప్రారంభిస్తున్న ఎంఈవో తారాసింగ్ తదితరులు

# మిషన్ భగీరథ పైప్‌లైన్ లీక్..వృథాగా పోతున్న తాగునీరు

- **వెండికోలులో 3 నెలలుగా వృథాగా తాగునీరు**
- **పట్టించుకోని అధికారులు**
- **ఆందోళనలో ప్రజలు**



వెండికోల్ గ్రామంలో మంజీర పైల్‌లైన్ లేకేజితో పారుతున్న నీటి దృశ్యం

**చౌటకూరు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** మండల పరిధిలోని వెండికోలు గ్రామంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకై 3 నెలలుగా తాగునీరు వృధాగా పారుతున్నా అధికారులు పట్టించుకోకపోవటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీరు వృధా కాకూడదని చెప్పే అధికారులు మూడు నెలలుగా తాగునీరు వృధాగా పారుతున్నా పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నర్సాపూర్, గజ్వేల్, తుప్రాన్ ప్రాంత ప్రజల తాగునీటి అవసరాలకు మండలంలోని చిక్రియాల గ్రామ శివారులో మంజీర రిజర్వాయర్‌లో ఇన్‌టెక్ వెల్‌ను నిర్మించారు. ఇన్‌టెక్‌వెల్ నుంచి హత్నూర మండలం బోర్పట్ల గ్రామ శివారులోని నీటి శుద్ధి కేంద్రం వరకు భారీ పైప్‌లైన్‌ను ఏర్పాటు చేసి జలాలను తరలిస్తున్నారు. వెండికోలు గ్రామ శివారులో మూడు నెలల క్రితం పైప్‌లైన్ లీక్ కావడంతో తాగు నీరు రోడ్డు పాలవుతోంది. నీరు వృధాగా పారుతున్నా సంబంధిత అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి లీకవుతున్న పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించి తాగునీరు వృధా కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు అధికారులకు సూచిస్తున్నారు.

## ప్రజావాణికి వచ్చే వినతులను తక్షణమే పరిష్కరించాలి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి.



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి.

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** ప్రజావాణికి ప్రజల నుంచి వచ్చే వినతులను అధికారులు పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి అన్నారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాయ సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (70) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డికి విన్న విస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...జిల్లా అధికారులు అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. రెవెన్యూ శాఖ(36), ఇతక శాఖలకు చెందిన (34)దరఖాస్తులు అందాయని తెలిపారు. మొత్తం 70 ఫిర్యాదులందాయని తెలిపారు. అదేవిధంగా రాబోయే ఇంటర్, 10వ తరగతిలో విద్యార్థులు ఈ విద్యా సంవత్సరం 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని విద్యాశాఖ అధికారికి సూచించారు. రానున్న వేసవిలో జిల్లాలో ఎక్కడ కూడా నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మరమ్మత్తులు ఏమైనా ఉంటే వెంటనే చర్యలు చేపట్టి నీటి ఎద్దడి లేకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, రెవెన్యూ అధిరాకి సంగీత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా మల్లన్న జాతర

**శంకర్ పల్లి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** మున్సిపల్ పరిధిలోని బుల్కాపూర్‌లో సోమవారం మల్లన్న జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర డైరీ డెవలప్మెంట్ కోపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు దేవులా నాయక్ లు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. దైవ భక్తితో మానసిక ప్రశాంతతను పొందుతారని ప్రతి ఒక్కరు దైవంతోపాటు సామాజిక సేవ భావాలను కలిగి ఉండాలని ఆకాంక్షి ంచారు. ఈకార్యక్రమంలో శంకరపల్లి పిఎసిఎస్ డైరెక్టర్ మణికొండ ప్రతాప్ రెడ్డి, శంకర్పల్లి మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు లక్ష్మమ్మ రాంరెడ్డి, గోపాల్, భానురి కృష్ణ, నాయకులు మణికొండ మధుసూదన్ రెడ్డి, అన్న ప్రసాదం దాతలు అయ్యప్ప రాజశేఖర్‌రెడ్డి, బాలన్నగారి కరుణాకర్ రెడ్డి, బాలన్నగారి వినయ్ వర్ధన్ రెడ్డి, పంతం శివకుమార్ యాదవ్, కంకంటి సంతోష్ కుమార్ యాదవ్, పాల్గొన్నారు

## కరాటేలో పర్వేద విద్యార్థిని ప్రతిభ

**శంకర్ పల్లి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** మార్షల్ ఆర్ట్స్‌లో పర్వేద విద్యార్థిని విజ్ఞశ్రీ గోల్డ్ మెడల్ సాధించారు. 4వ నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ షిప్ హైదరాబాద్ సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ పోటీలో నాలుగు దేశాలు (ఇండియా, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్). తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండల పరిధిలోని పర్వేద గ్రామానికి చెందిన శ్రీధర్ కూతురు విజ్ఞశ్రీ బంగారు పథకాన్ని సాధించిందని తెలిపారు. పర్వేద గ్రామానికి చెందిన అమ్మాయి గోల్డ్ మెడల్ సాధించినందుకు గ్రామస్తులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. విజ్ఞశ్రీ మరెన్నో విజయాలను సాధించాలని తల్లిదండ్రులు కోరుకున్నారు.

## 45వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

**శంకర్ పల్లి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** శంకర్ పల్లి మండలంలోని కొండకల్ తండావాసులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారంతో 45వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్షలో కూర్చున్న పలువురు మాట్లాడుతూ గిరిజనులకు చెందిన 80 ఎకరాల భూమిని అక్రమంగా ఆక్రమించుకొని దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులను బెదిరిస్తూ భూమిని ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని 45రోజులుగా ఆందోళన కార్యక్రమాలు చేస్తుంటే పాలకులకు చీమకుట్టినట్లు లేకపోవడం దుర్మార్గమన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు తీవ్రం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

## ఖేడ్‌లో కొనసాగుతున్న పోస్టల్ కార్డుల ఉద్యమం

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా చేసిన హామీలో భాగంగా విద్యార్థులకు ఎలక్ట్రిక్ స్కూటీ హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నియోజవర్గంలో కాంగ్రెస్ జాతీయ నాయకురాలు ప్రియాంకగాంధీకి విద్యార్థులు పోస్టల్ ఉత్తరుల పంపుతున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి కుమార్తె టిఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహారెడ్డి శ్రేయరెడ్డి, నాయకులు అశోక్‌రెడ్డి, మండల యూత్ పార్టీ అధ్యక్షుఉలు మచ్చేందర్, చింటూ నరేష్, గౌరీ ప్రసాద్, సాయి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలంకు శివస్వాముల పాదయాత్ర

**అల్లాదుర్గం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** మండల కేంద్రం నుంచి సోమవారం శివస్వాముల ఆంధ్రప్రదేశ్ కర్నూల్‌జిల్లాలోని భ్రమరాంబ సమేతంగా కొలువున్న శ్రీమల్లికార్జునస్వామిని దర్శించుకునేందుకు శివస్వాములు పాదయాత్రగా పయనమయ్యారు. అల్లాదుర్గంలోని శ్రీలక్ష్మినరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడిలను కట్టుకుని పరమేశ్వరుడిని స్మరిస్తూ శ్రీశైలంకు బయలెక్కారు. గురుస్వామి సదానందం ఆధ్వర్యంలో 12 మంది శివస్వాములు పయనమవ్వగా కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు బలరాం, శివస్వాములు రమేష్, దుర్గయ్య, రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

## 8వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్ష

**నర్సాపూర్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త :** పట్టణానికి నష్టం కలిగించే దంపు యార్డును ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని నర్సాపూర్ పిఎసిఎస్ చైర్మన్ రాజుయాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ప్యారానగర్‌లో నిర్మిస్తున్న జిహెచ్‌ఎంసి డంప్‌యాడ్‌కు వ్యతిరేకంగా నర్సాపూర్‌లో అఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్షలో రాజుయాదవ్ పాల్గొన్నారు. సోమవారంతో నర్సాపూర్‌లో నిర్వహిస్తున్న దీక్షలు 8వరోజుకు చేరుకుంది. ఈరోజు నిర్వహించిన దీక్షలో నర్సాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ రాజు యాదవ్ ఆధ్వర్యంలో పిఎసిఎస్ డైరెక్టర్లు ఈ దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సాపూర్ అడవి ప్రాంతంలో ఈ దంపు యార్డు నిర్మించినట్లయితే నర్సాపూర్‌కు ఎక్కువ నష్టం వాటిల్లుతుందని, అదేవిధంగా వాతావరణం మొత్తం కలుషితమవుతుందని అన్నారు, దీంతో ఇక్కడి ప్రజలకు ఎంతో నష్టం కలుగుతుందన్నారు. ప్రజలకు వాతావరణానికి ముప్పు కలిగించే ఈ దంపు యార్డును ప్రభుత్వం వెంటనే ఈ డంపింగ్ యార్డ్ ను ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ రాజు యాదవ్ తో పాటు డైరెక్టర్లు కమ్మరి కృపాచారి, రవి గౌడ్, మురళీధర్, రూప్ల, కుమ్మరి నగేష్. లాయర్ ఆనంద్ కుమార్, అఖిలపక్షం నాయకులు గోడ రాజేందర్. మిర్యాల చంద్రశేఖర్. సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ ఎమ్మెల్సీ కాంగ్రెస్‌దే

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 24,ప్రభాతవార్త:** రాబోయే ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు మోహన్‌నాయక్, రాజ్‌కుమార్‌గౌడ్ ఉదయ్, ప్రవీణ్, అక్బర్‌లు అన్నారు. సోమవారం చిన్నశంకరంపేటలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ చేశారు. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డి ఘనవిజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలబడాలని కోరారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయం సాధించేంతవరకు అహోరాత్రులు కష్టపడాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 27వ తేదిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డి బ్యాలెట్ సిరియల్ నంబర్ రెండులో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## ఎమ్మెల్సీ రవికుమార్‌ను కలిసిన మండల నాయకులు



ఎమ్మెల్సీ రవికుమార్‌ను సన్మానిస్తున్న మండల నాయకులు

**నవాబుపేట ఫిబ్రవరి24,ప్రభాతవార్త :** ఎమ్మెల్సీ రవికుమార్‌ను అలియాస్ తీన్‌మార్ మల్లన్నను సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రసిడెంట్ కొండల్‌యదవ్ తదితరులు మార్యాదపూర్వరంగా కలిశారు. ఈ సందర్భంగాఆయనను శాలువతో సన్మానించి వారి లభిమానాన్ని చాటు కున్నారు. పలు విషయాలపై వారు చర్చించుకున్నారు. ముఖ్యంగా బీసిల అభ్యున్నతి వారి చైతన్యం తదితర విషయాలను వారు సమీష్టిగా చర్చించినట్లు తెలిపారు. అదేవిధంగా ప్రస్తుత రాజకీయాలు వాటి పర్యావసానంపై మాట్లాడినట్లు మండల నాయకులు అన్నారు. ఎమ్మెల్సీ విలువైనా సమయాన్ని కెటాయించి పలు ఆంశాలపై మాట్లాడినందుకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపామని అన్నారు. సీనియర్ నాయకులు ఎదుగుతున్న నాయకుల పట్ల సానుకూలంగా వ్యవహరించినప్పుడు ఆసక్తితో ప్రజాసేవలో ముందుండటానికీ దోహదపడతాయని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## నీటి సౌకర్యం లేక నిరుపయోగంగా మరుగుదొడ్లు

**దౌల్తాబాద్,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త:** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నీటి సౌకర్యం లేక మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. లక్షలు ఖర్చుచేసి విద్యార్థుల సౌకర్యార్థం నిర్మించిన మరుగుదొడ్లు నీటి సౌకర్యం లేకపోవడంతో పాఠశాలల్లోని విద్యార్థినిలు అత్యవసర సమయాల్లో బయటకు వెళ్ళడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నా మన్నారు. మరుగుదొడ్లు ఉన్నాగాని నీటి సౌకర్యం లేకపోవడంతో ఎక్కడికి వెళ్ళా లో తెలియక కొన్నిసంధర్భాలలో బహిరంగా ప్రధేశాలకు వెళ్ళవలసి వస్తుందని,తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థినిలు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఇకనైనా సంబందిత అధికారులు స్పందించి నీటి సౌకర్యం ఏర్పాటు చేసి నిర్మించిన మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా తగుచర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## శ్రీశైలంకు బయలుదేరిన శివస్వాములు



శ్రీశైలంకు వెళ్ళుతున్న శివస్వాములు

**బొంరాస్‌పేట్,ఫిబ్రవరి24,ప్రభాతవార్త :** బొంరాస్‌పేట్ మండల పరిధిలోని ఏర్పుమళ్ళ గ్రామానికి చెందిన శివస్వాములు సోమవారం రోజు వాహనాలలో శ్రీశైలంకు తలపై ఇరుముడితో బయలుదేరారు.గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో ఇరుముడులను కుటుంబసభ్యుల సమాక్షంలో గురుస్వాములతో కట్టించుకొని గ్రామంలో విధులలో శివనామాస్మరణతో శ్రీశైలంకు బయలుదేరారు.శివస్వాములు మండలం,ఆర్ధమండలం దీక్షలను స్వీకరించి నియామనిష్టలతో శివునికి ఉదయం,సాయంత్రం పూజలు నిర్వహించి ఒక్కపూట భోజనంతో దీక్షలను కొనసాగించారు.మహాశివరాత్రి రోజు వరకు శ్రీశైలంకు చేసుకొని తలపై ఉన్న ఇరుముడిలో ఉన్న బియ్యం,ఆమ్మవారి వస్త్రులు,ఇతర పూజసామాన్లను స్వామివారికి సమర్పించి మహాశివరాత్రి నాడు ఈ దీక్షలను విరమిస్తారు.ఈ కార్య క్రమంలో నరేష్,వెంకట్‌రాములు,వెంకటయ్య,నరేష్,కృష్ణయ్య,నవీన్ పాల్గొన్నారు.

## రోడ్డు సమస్య తీర్చిన మాజీ సర్పంచ్ దండు ఇస్తారి



కోదుబొలి రెడ్డి గ్రామంలో రోడ్డు వేస్తున్న దృశ్యం

**శంషాబాద్, ఫిబ్రవరి 24. ప్రభాతవార్త :** సుల్తాన్ పల్లి అనుబంధ గ్రామం అయిన కోదుబోలి దొడ్డి గ్రామ రెవిన్యూ పరిధి లోని దాదాపు 15 మంది గ్రామ రైతులకు పొలాలకు వెళ్లే మార్గం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య తెలుసుకున్న గ్రామా మాజీ సర్పంచ్ దండు ఇస్తారి భూయజమానులతో మాట్లాడి రోడ్డు మార్గం ఏర్పాటు చేయించారు. ఆయన రైతులను ఒప్పించి సామరస్యంగా రోడ్డుకు స్థలాన్ని వదిలి వేయడంతో అనేక సంవత్స రాలుగా ఉన్న సమస్య పరిష్కారం అయింది. ఈ సందర్బంగా రైతులు సంతోషం వ్యక్తం చేసి గ్రామ మాజీ సర్పంచ్ దండు ఇస్తారి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేసారు..ఈ కార్యక్రమంలో ప్రభాకర్ గౌడ్,గొసుల మల్లికార్జున్ యాదవ్, నసీర్ ఉద్దీన్, ఇటిక పల్లి సిద్దయ్య, గొంగళ్ల శ్రీశైలం, మొయినుద్దీన్, మునీర్,ఇటిక పల్లి గోపాల్, బండ్ల గూడెం శివ కుమార్ గౌడ్, గొంగళ్ల ఒజయ్య, కుమ్మరి జంగయ్య, చాకలి పోచయ్య, బైండ్ల చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి



పాండురంగయ్యకు సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

**-కుల్కచర్ల,ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** ప్రభుత్వ ఉద్యోగం చేసే ప్రతి ఒక్కరికి ఉద్యోగ విరమణ తప్పనిసరి అని గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘంజిల్లా అధ్యక్షుడుహరిలాల్ అన్నారు. సోమవారం కుల్కచర్ల మండల పరిధిలోని ఇప్పాయిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయుడు పాండురంగయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధానోపాధ్యాయులుగా ఇప్పాయి పల్లిలో విధులు నిర్వహిస్తున్న పాండురంగయ్య పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల మేధా సంపత్తికై ఎంతో కృషి చేశారని ఆయన అన్నారు. ఏ పాంశాలలో పనిచేసిన ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థు లను ఉన్నత స్థానానికి చేర్చే విధంగా కృషి చేస్తారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కుల్కచర్ల మండల విద్యాధికారి హబీబ్ అహ్మద్, దోమ మండల విద్యాధికారి వెంకట్,చౌడపూర్‌మండలవిద్యాధికారి రామచందర్, తహసీల్దార్ జైపాల్‌రెడ్డి,టిఆర్టియు జిల్లాకార్యదర్శిఅమర్‌నాథ్,వివిధ ఉపాధ్యాయ సంఘాలనాయకులు, పాఠశాల ఉపాధ్యాయుల బృందం, మాజీ ఎంపీటీసీ పద్మ రఘు గౌడ్, ఆనంద్, మాజీ సర్పంచ్ బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## నాణ్యమైన ఆహారం అందించాలి: వజ్రేశ్

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** వినియోగదారులకు నాణ్యమైన ఆహారం అందించాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ కొండాపూర్ రోడ్డులో సోమవారం ఆహార విక్రయ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఇడబ్ల్యుఎస్‌కాలనికి చెందిన సార శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎస్‌విఎం ఫుడ్‌కోర్టును వజ్రేశ్‌యాదవ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈసందర్భంగాఆయనను నిర్వాహకులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్‌బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలుయాదవ్, కీసరగుట్ట డైరక్టర్లు సగ్గు అనిత, సామల అమరేందర్, మాజీ వార్డుసభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

# లిటిల్‌స్కాలర్స్‌స్కూల్‌లో అలరించిన సైన్స్ ఫెయిర్

### సందర్శకులకు వివరిస్తున్న విద్యార్థులు
### విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలు...
### చిన్నారుల మేధో శక్తిని పెంపొందిస్తాయి



సైన్స్‌ఫేర్‌ను ప్రారంభిస్తున్న ఏంఈఓ పాండు, కమీషనర్ శంకర్‌నాయక్

**ఆమనగల్లు,ఫిబ్రవరి24,ప్రభాతవార్త:**విద్యార్థుల్లో దాగిఉన్న శాస్త్రసాంకేతిక నైపుణ్యా లను వెలికితీసివారి ప్రతిభకుపదును పెట్టేందుకు విజ్ఞాన శాస్త్ర కార్యక్రమాలు దోహద పడు తాయని ఆమనగల్లుమండల విద్యాధికారి పాండు, పురపాలకసంఘం కమీషనర్ శంకర్ నాయక్‌లు అన్నారు. పాఠశాలల్లోనిర్వహించే సైన్స్ ఫేర్ కార్యక్రమాలు చిన్నారుల ప్రతిభకు పట్టం కడుతాయని, వారిమేధస్సును ఉపయోగించి ఆవిష్కరించే వస్తు పరిజ్ఞానంలోవారి ప్రతిభాపాటవాలు దాగి ఉంటాయనివారు కొని యాడారు. గణితం,సైన్స్‌లపై పట్టుఉంటే ఆవిష్కరణలకు అంతం ఉండదని వారు పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంలోని లిటిల్ స్కాలర్స్ హైస్కూల్‌లో సోమవారం నిర్వాహకులు సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి విద్యార్థుల నుండి విశేష స్పందన లభించింది. అనేకరకాల వస్తువులను తయారు చేసుకొచ్చిన విద్యార్థులు ప్రత్యేక స్టాళ్ళద్వారా వాటిని ప్రదర్శి ంచారు. సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని తిలకించడానికి విద్యార్థుల తల్లి దండ్రులతోపాటుచుట్టుపక్కల ప్రాంతాలప్రజలు, పలుపాఠశాలల విద్యార్థులు పెద్దసంఖ్యలో పాఠశాలకు విచ్చేశారు. ఎంఈఓ పాండు, కమిషనర్ శంకర్ నాయక్‌లు ముఖ్య అతిథులుగా హాజరై పాఠశాల చైర్మన్ చుక్క అల్లా జిగౌడ్, అకాడమిక్ అడ్వయిజర్‌జిల్లెల సుదర్శన్‌రెడ్డిలతోకలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన పలు వస్తువులను తిలకించగా, విద్యార్థులు వాటి పనితీరును విశ్లేషించారు. ఈసంధర్భంగా విద్యార్థులను ముఖ్యఅతిథులు కొనియాడారు. ఎలక్ట్రానిక్స్ వస్తువులు, వైర్లెస్ పరికరాల పనితీరు, సోలార్‌సిస్టం, మానవ అవయవాలు, వాటివంటి అనేక వస్తువు లనుప్రదర్శించి ఆకట్టుకున్నారు.బాలమేధస్సు నుప్రతిఒక్కరూ ప్రోత్స హించాలని పాండు, శంకరనాయక్ సూచించారు. సమాజానికి ఉప యుక్త కరంగా ప్రతిభాపాటవాలను వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాలకరస్పాడెంట్ జిల్లెల సుజాత,చుక్కా సావిత్రి గౌడ్, ప్రిన్సి పాల్‌శ్రీశైలం,ట్రస్మఆమనగల్లుడివిజన్‌ప్రధానకార్య దరి శ్రీరామ్, ఉపాధ్యాయబృందం యాదయ్య, తాళ్ళంవతిగౌడ్, రమాదేవి ఉన్నారు.

## బిసి కులగణనకు యాదవులు ఆమోదం తెలపాలి



అంజన్‌కుమార్‌యాదవ్‌ను సన్మానిస్తున్న వజ్రేశ్‌యాదవ్, జంగయ్యయాదవ్ తదితరులు

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణనను యాదవులంతా ఆమోదించాలని సికింద్రాబాద్‌మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ అన్నారు. హైదరాబాద్‌లోని ఓల్డ్ ఎమ్మెల్యే నివాస సముదాయంలో సోమవారం జరిగిన యాదవ కులస్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఘట్‌కేసర్ ఉమ్మడి మండలానికి చెందిన యాదవ నాయకులు సమావేశానికి హజరయ్యారు. టిపిసిసి ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో ఘట్‌కేసర్ నాయకులు వెళ్లి మాజీ ఎంపి అంజన్‌కుమార్‌ను శాలువాతో సన్మానించారు.కాంగ్రెస్ జిల్లానాయకులు ముల్లిజంగయ య్యాదవ్, ఘట్ కసర్ మున్సిపల్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలుయాదవ్, మాజీ ఉప సర్పంచ్ -యాదవస ంఘం అధ్యక్షులు రాజబోయిన యాదగిరియాదవ్, మైసమ్మగుట్ట మాజీ చైర్మన్ మామిండ్ల చిత్తారియాదవ్, డిసిసి కార్యదర్శి ఉల్లి అంజ నేయులు, నాయకులు అబ్బసాని పొన్నయ్యయాదవ్, లంబ శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

## పరిశ్రమ వ్యర్థాలతో పాడవుతున్న పంటలు



**షాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** పరిశ్రమ నుంచి వెలబడుతున్న కాలుష్యంవల్ల సమీపంలోని పంటలు దెబ్బతింటున్నాయని మండలంలోని ఎల్లొండగూడ గ్రామ రైతులు ఆరోపిస్తున్నారు. ఎల్గొండ గూడ కు చెందిన రైతు నర్సింహులుగౌడ్ 8ఎకరాలు కౌలు తీసుకుని వరి సాగు చేశాడని, కానీ ఎగ్ వే కంపెనీ వల్ల భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి గ్రామస్తులను, రైతులను ఆదుకోవాలని కోరారు.

## అధ్యక్షుడికి ఘన స్వాగతం

**షాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** భారతీయ కిసాన్ సంఘం జాతీయ అధ్యక్షులు కొండాలసాయిరెడ్డి, సంఘటన మంత్రి మాదిరెడ్డి రాజిరెడ్డిలకు రాష్ట్ర బికేఎస్‌నాయకులు సోమవారం ఘనస్వాగతం పలికారు. భారతీయ కిసాన్ సంఘం జాతీయ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికై శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న సందర్భంగా ఆయనకు ఘనస్వాగతం పలికి సన్మానించారు. రైతుల సమస్యల పరిష్కారానికి భారతీయ కిసాన్ సంఘం ఎప్పుడు పోరాటం చేస్తూనే ఉంటుందని జాతీయ అధ్యక్షుడు సాయిరెడ్డి తెలిపారు.రంగారెడ్డి జిల్లాసహకార్యదర్శిగంగిరెడ్డి సత్యనారాయణరెడ్డి,అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కార్యదర్శివిశ్వనాథం, పాల్గొన్నారు

# ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



జూనియర్ కళాశాల విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగిన దృశ్యం

**శామీర్‌పేట, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**శామీర్‌పేటలోని కెఎల్‌ఆర్ కళాశాల 2012-2014 బ్యాచ్ ఇంటర్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఘనంగ జరిగింది. శామీర్‌పేటలోని గతంలో ఉన్న కెఎల్‌ఆర్ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు పదేళ్ల తరువాత పూర్వ విద్యార్థులు కలుసుకుని ఆత్మీయ సమ్మేళనంను ఉత్సాహంగ జరుపుకున్నారు. 2012-2014బ్యాచ్ ఇంటర్ సైన్స్ ఎంపిసి, బైపిసి విద్యార్థులు మరుపురాని తీపి జ్ఞాపకాలు అనే పేరుతో పదేళ్ల తరువాత పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని కన్నుల పండుగగా జరుపుకున్నారు. ప్రస్తుత విద్యార్థులు చెడు దారి పట్టకుండ విద్య ఆవశ్యకతను గుర్తించేలా ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. కళాశాల నాటి అధ్యాపకులు, నాటి విద్యార్థులు పాల్గొని వారి అనుభవాలను, నాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. కళాశాల ప్రాంగణంలో ఉన్న మాజీ రాష్ట్రపతి దివంగత డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలామ్ విగ్రహానికి పూలమాల వేసి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలామ్ ఆశయ సాధనకు మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి కెఎల్‌ఆర్ కళాశాల భవనాన్ని నిర్మించి దాన్ని స్థాపించి ఆ విద్యా సంవత్సరంలోనే కళాశాలను ప్రారంభించారని అన్నారు. విద్యార్థులకు స్ఫూర్తిగా ఉండటానికి ఏపిజె అబ్దుల్ కలామ్ విగ్రహాన్ని కళాశాల ప్రాంగణంలో ప్రతిష్ఠించారని వారు గుర్తుచేశారు. లీడ్ ఇండియా సైన్యాన్ని ఏర్పాటు చేసి అనేక కార్యక్రమాలను చేపట్టారనిలీడ్‌ఇండియా సూక్తులు, కార్యక్రమాలను వారు గుర్తు చేసుకున్నారు. లీడ్ ఇండియా కార్యక్రమాలు అమ్మనాన్న జీవితం తమకు ఎంతో స్ఫూర్తిదాయకమని గుర్తు చేశాయని పలువురు పూర్వ విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. ఇంటర్మీడియట్ స్థాయి విద్య భవిషత్‌ను చూపించిందని, ఏకాగ్రత చేయాలని సూచించిందని లీడ్ ఇండియా కార్యక్రమాలు స్ఫూర్తిగ నిలిచాయని అన్నారు. సాయినాథ్ చేసిన నృత్యాలు అందర్ని ఆకట్టుకున్నట్లు తెలిపారు. అప్పటి కళాశాల ప్రిన్సిపల్ శ్రీకాంత్ రామరాజు మాట్లాడుతూ నాటి ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డితో తనకు ఉన్న అనుబంధాన్ని, బాధ్యతలను తనపై ఉంచిన నమ్మకాన్ని గుర్తు చేసుకున్నారు. జీవితంలో జ్ఞానాన్ని పొందటం కోసం ప్రతి రోజు ఒకటి చదవాలని కోర్సులు చేయాలన్నారు. యువత సన్మార్గంలో నడవాలని సమాజంలో ఆదర్శంగ నిలవాలని ఆయన సూచించారు. నాటి అధ్యాపకులు శివప్రసాద్, యాదగిరి, మహేందర్‌లు పేర్కొంటూ జీవితంలో ఏదైనా సాధించాలంటే అది మనసులోకి రావాలని ఆలోచన చేస్తే ఏదైనా సాధించవచ్చని వారు అన్నారు. కళాశాలను స్థాపించిన కెఎల్‌ఆర్, ఆర్గనైజర్ శ్రీనివాస్‌రెడ్డిలు చేసిన కృషిని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాటి అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్య అభ్యసించాలి

### -ఏఈ నర్సింలుగౌడ్,
### ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జైపాల్ రెడ్డి

**కుల్కచర్ల,ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన



విద్యార్థుల తల్లిదండ్రులకు టిఫిన్ బాక్స్ లు అందజేసిన మేజిక్ బస్సు సిబ్బంది

విద్యను అభ్యసించాలని మేజిక్ బస్ సీనియర్ ఏఈ నరసింహులు గౌడ్, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జైపాల్ రెడ్డి అన్నారు. సోమవారం కుల్కచర్ల మండలం కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు ఆరోగ్యంగా ఉండడానికి పాఠశాల ఆవరణ తోపాటు ఇంటి పరిసరాలు కూడా శుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులను తగిన విధంగా ప్రోత్సహిస్తే చిన్నప్పటి నుండి వారు రాటుదేలే అవకాశం ఉంటుందని తెలిపారు. బాల్య వివాహాలు నిర్మూలించడానికి తల్లిదండ్రులు ముఖ్య భూమిక పోషించాలని వారు సూచించారు. పాఠశాల నుండి ఇంటికి వచ్చిన తర్వాత తగినవిధంగా పిల్లలను పరిశీలిస్తూ వారికోసం సమయాన్ని కేటాయించాలని సూచించారు. ఇంటిలో పిల్లల ముందు తల్లిదండ్రులు మద్యం తాగారాదని దానిద్వారా పిల్లలకు అలవాటయ్యే ఆస్కారం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. మరి కొద్ది రోజుల్లో ఎండలు ముదిరి విద్యార్థులు, తల్లిదండ్రులు వడ దెబ్బ తగిలి అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉందని వాటిని నివారించేందుకు ప్రతిరోజు ఆరు లీటర్ల చొప్పున నీరు తాగాలని, పని సమయాలు తప్ప ఎక్కువగా ఎండలో తిరగరాదని అత్యవసర పరిస్థితిలో తగుజాగ్రత్తలుపాటించి ఆరోగ్యంగా ఉండేందుకు ప్రయత్నించాలని తెలిపారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు మ్యాజిక్ బస్ సూచన మేరకు ప్రతి ఒక్కరికి టిఫిన్ బాక్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కుల్కచర్ల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి భాస్కర్ గౌడ్, సీనియర్ నాయకులు జోగు వెంకటయ్య గౌడ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంఅధికారి వెంకటయ్య,సీనియర్‌నాయకులు తమ్మలి రామ చంద్రయ్య, నాగని బిచ్చన్న, ఎస్‌ఎంసి చైర్మన్ రాజమ్మ మాజీ వార్డు మెంబర్ మోత్కూరి వెంకటేష్, అంగన్వాడీ టీచర్ పద్మ, ఆశా కార్యకర్తలు స్వరూప,సునీత,మ్యాజిక్‌బస్‌సిబ్బంది ఏఈ కృష్ణ, వెంకటయ్య, ఎల్ఎస్‌ఎ నరేష్, ఎల్ఎస్‌ఈ నర్సింలు తల్లిదండ్రులు నాయకులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి గైర్హాజరైన అధికారులు

### ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు
-ప్రజావాణికి హాజరుకాని ఆయా శాఖల అధికారులు

**అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్న పలు గ్రామాల ప్రజలు**

**ధారూరు,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త:**మండలప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి కేవలం ఇద్దరే ఇద్దరు అధికారులు హాజరై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు ప్రజావాణికి హాజరై సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించాలని కలెక్టర్ పలుమార్లు ఆదేశించినప్పటికీ ప్రజావాణికి హాజరు కాలేకపోతున్నారు. ఎంపీడీవో నరసింహులు, ఐసిడిఎస్ సూపర్వైజర్ శాంతాబాయి ఇద్దరు మాత్రమే ప్రజావాణిలో పాల్గొన్నారు.

మిగతా శాఖల ఏఈలు, వివిధశాఖల అధికారులు హాజరుకాకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పెండింగ్‌లో సమస్యల పరిష్కారం గురించి ప్రజావాణిలోసంబందిత అధికారులకు విన్నవించుకునదామంటే అధికారులు అందుబాటులో లేకపోవడంతో సమస్యలను చెప్పుకోలేక ప్రజలు వెను తిరుగాల్సి వస్తుందని విమర్శలు



దరఖాస్తును స్వీకరిస్తున్న ఎంపిడిఒనర్సింలు, ఐసిడిఎస్ సూపర్వైజర్ శాంతాబాయి

వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రతి సోమవారం జరిగే ప్రజావాణికి హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకొని వచ్చే వారం ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ఆలయాలు



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ఆలయాలు

**మాడ్గుల,ఫిబ్రవరి23 ప్రభాతవార్త:** మహాశివరాత్రి బ్రహ్మోత్స వాలను పురస్కరించుకొని మండలంలోని ఆర్కపల్లి, మాడుగుల, కొలుకులపల్లి గ్రామాలలోని శివాలయాలు బ్రహ్మోత్స వాలకు ముస్తాబయ్యాయి. విద్యుత్ కాంతులతో పత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆర్కపల్లికాశీ విశ్వేశ్వర వీరాంజనేయ స్వామిఆలయంలో ప్రత్యేకకార్యక్రమాలు, శివపార్వతుల కళ్యాణ నిర్వ హిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆకుతోట నరసింహుగుప్తా తెలిపారు. అదేవిధంగా మాడుగుల స్వయంభు శివాలయంలో కళ్యాణో త్స వము నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపక చైర్మన్ సూదిని పద్మా రెడ్డి ఒక ప్రకటన తెలిపారు భక్తులు తమ మొక్కులు చెల్లించుకుని శివపార్వతుల దీవెనలు పొందాలని అన్నారు.కాశీ విశ్వేశ్వర వీరాంజనేయ స్వామి ఆలయంలో మహిళలకు 300 చీరలను లక్కీడ్రాప్ ద్వారా ఎంపిక చేసి పంపిణీ చేస్తున్నట్లు వారు తెలిపారు. ఇప్పటికే కరపత్రల ద్వారా పలువురు ప్రముఖులను ఆహ్వానించడం జరిగిందని వారు తెలిపారు. శివపార్వతుల కళ్యాణోత్స వానికి మండలం నుండే కాకుండా వివిధ జిల్లాల నుండి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తగిన ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు.

## కరాటే లో ప్రతిభ చాటిన మందిపాల్ విద్యార్థులు




విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

**చౌడపూర్ ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలంలో 23వ తేది ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి కుంగ్ ఫూ కరాటే ఛాంపియన్ పోటీల్లో, చౌడపూర్ మండలంలోని మందిపల్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు.. హైస్కూల్ నుండి ఐదుగురు విద్యార్థులు పాల్గొని, టోర్నమెంట్లో పటాస్ విభాగంలో ఇద్దరు విద్యార్థినులు సౌజన్య, యశ్విని మొదటి బహుమతిని,తేజశ్రీ, నిహారిక, చరణ్ రెండవ బహుమతిని సాధించారు.గెలుపొందిన విద్యార్థులను, మండల విద్యాధికారి పాఠశాల, ప్రధానోపాధ్యాయులు రాంచందర్, విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.పాఠశాల కమిటి చైర్ పర్సన్ యాదమ్మనర్సింలు, ఇంచార్జి యాదయ్య ఉపాధ్యాయులు మురళీధర్, విజయ శ్రావణ్ కుమార్, అనిల్, శ్రీను, జహీర్,సిఆర్పి విజయ్,లక్ష్మన్, గౌతం విద్యార్థులను అభినందించారు

## విద్యాసంస్థకు పూర్వవైభవం తీసుకురావాలి

### ఆర్‌ఓబీ పూర్తి చేయండి..సిఎంకు సంజీవగౌడ్ లేఖ



పోటో: 24 జిటికె 3 సిఎంకు లేఖ పంపిస్తున్న టిడీపీ మల్కాజ్‌గిరి పార్లమెంట్

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో విశేషమైన చరిత్ర కల్గిన గురుకుల్ విద్యాసంస్థను అభివృద్ధి చేసి, రైల్వేవంతెన నిర్మాణం పూర్తి చేయాలని కోరుతూ టిడిపి మల్కాజ్‌గిరి పార్లమెంట్ అడహక్ కమిటీ సభ్యులు వేముల సంజీవగౌడ్ సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఉత్తరం రాశారు. ఈమేరకు ఘట్‌కేసర్‌లోని తపాలా కార్యాలయంలో ఆయన సీఎంకు లేఖ రాసి స్పీడ్ పోస్టు ద్వారా పంపించారు. గురుకుల్‌లో 27 ఎకరాల స్థలం ఉందని ఆక్రమణకు గురి కాకుండా పరిరక్షించి గురుకుల్‌ను అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. కోట్ల రుపాయల విలువైన గురుకుల్ భూములు హైటెక్ సిటి మాదాపూర్‌లో 627 ఎకరాలు ఉండేవని ఆక్రమణలతో గురుకుల్‌కు ఏలాంటి ఆదాయం రావడం లేదని, గురుకుల్‌ను స్థాపించిన బన్సీలాల్‌వ్యాస్‌జీ ఆశయాలకు అనుగుణంగా గురుకుల్‌కు పూర్వవైభవం తీసుకురావాలని కోరారు. ఘట్‌కేసర్‌లో రైల్వేగేటుపై నిర్మిస్తున్న వంతెన పనుల్లో జాప్యం జరిగి వాహనదారులు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని త్వరగా పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంజీవగౌడ్ లేఖలో పేర్కొన్నారు.

## ఉత్సాహంగా ఎస్‌సి హాస్టల్ క్రికెట్ పోటీలు

**ఘట్‌కేసర్, ఫి బ్రవరి 24, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో ఎస్‌సీ హాస్టల్ విద్యార్థుల క్రికెట్ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి.

విద్యతో పాటు క్రీడల్లో రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్ ఉంటుందని టోర్నమెంట్ ప్రారంభించిన ఘట్‌కేసర్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ పరిధిలో మైసమ్మగుట్ట కాలనీ వద్ద ఎస్‌సీ స్టూడెంట్ హాస్టల్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ మీట్ 2కె25 క్రికెట్ టోర్నమెంట్‌ను ఆమె జిల్లా ఎస్‌సీ సంక్షేమ అధికారులు, వార్డెన్‌లతో కలిసి ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని మైదానంలో బ్యాటింగ్ ఆడి క్రికెట్ పోటీలను ఆమె మొదలుపెట్టారు. ఈసందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాళ వేసి నివాళులు అర్పించారు. క్రీడాకారులకు స్పోర్ట్స్ టీషర్ట్స్‌ను పంపిణీ చేశారు. మేడ్చల్ జిల్లా స్థాయిలో ఎస్‌సీడిడి హాస్టల్ విద్యార్థులకు క్రికెట్ పోటీలను నిర్వహించడంతో వారికి శరీర, మానసిక ఆరోగ్యం కల్గుతుందని తెలిపారు. విద్యతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సమాజంలో క్రీడల్లో రాణించినవారు ఉన్నత స్థాయిలో ఉన్నారని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బండారి అంజనేయులుగౌడ్, మున్సిపల్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కొరుబొతు నాగరాజు, ఎస్‌సీ హాస్టల్ అధ్యక్షులు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలేపల్లి ఎల్లమ్మ హుండీ లెక్కింపు



ఎల్లమ్మ ఆలయం హుండీని లెక్కిస్తున్న సభ్యులు

**దుద్యాల్,ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన పోలేపల్లి ఎల్లమ్మ జాతర బ్రహ్మోత్స వాలు సోమవారంతో ముగిశాయి. బ్రహ్మోత్స వాలకు సంబంధించి గత 20 రోజుల నుండి భక్తులు ఎల్లమ్మకు చెల్లించుకున్న వివిధ రకాల కానుకలు డబ్బు, వెండి, బంగారములను ఈవో రాజేందర్ రెడ్డి, చైర్మన్ జయరాములు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు లెక్కించారు. హుండీ లెక్కింపు ద్వారా 3,65,534 రూపాయలు నగదు, 1100 గ్రాముల వెండి ఎల్లమ్మ దేవతకు ఆదాయంగా వచ్చినట్లు ఈవో రాజేందర్ రెడ్డి తెలిపారు. గత సంవత్సరం బ్రహ్మోత్స వాలలో వచ్చిన ఆదాయం కంటే 80,000 రూపాయలు ఎక్కువగా వచ్చినట్లు తెలిపారు.

## కనువిందు చేస్తున్న మోదుగుపూలు



విరగ పూసిన మోదుగ పూలు

**నవాబుపేట, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**
మండుటెండలో పంటపొలాల గట్లపై కనువిందు చేస్తున్న మోదుగపూల సొగసులు ప్రకృతి ప్రేమికులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. ముదురు కాషాయవర్ణంతో బగబగమంటున్న రవికిరణాలకు రెట్టింపు అందాలతో మోదుగపూలు పంటపొలాల మధ్య ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ పువ్వులే ఒకనాటి గ్రామీణప్రజలకు హోళీ వేడుకలో చల్లుకునే ప్రకృసిద్ధంగా లభించేరంగుగా విరాసిల్లింది. హోళీవేడుకలకు ముందే ఈపువ్వులు విచ్చుకుని పూర్తివర్ణాన్ని సంతరింకున్నపుడు చెట్టునుండి కోసి కొన్నాళ్ళు ఎండలో ఎండబెట్టి పూర్తిగా ఎండాక చూర్ణంగా తయారు చేసుకుని భద్రపరుచుకుని హోళీపండగరోజు ముందుగా తయారు చేసుకున్న మోదుగపూల చుర్ణాన్ని నీటిలోకలుపుకుని రంగుగావాడుకునేవారు. ఈపూల చెట్లవద్ద స్థానిక ప్రజలతో పాటు పట్టణప్రాంతానికిచెందినవారు ఫోటోలు తీసుకుంటారు. పువ్వులను కోసుకుని వెంటతీసుకు వెళ్ళడం రివాజు.

## రావల్‌కోల్‌లో ఘనంగా మల్లన్న జాతర




రావల్‌కోల్‌లో మల్లికార్జునస్వామిని దర్శించుకున్న బిజెపి నేతలు

**మేడ్చల్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**
మేడ్చల్ మండలంలోని రావల్‌కోల్ గ్రామంలో సోమవారం మల్లన్న జాతర ఘనంగా జరిగింది. ఈసందర్భంగా ఉదయం ఆలయంలో పూజలుజరిపి మధ్యాహ్నం మల్లికార్జునస్వామి కళ్యాణం, అగ్నిగుండాలు, ఒగ్గుకథలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వ హించి స్వామికి నైవేద్యం సమర్పించారు. జాతరకు బిజెపి రాష్ట్రనాయకుడు విక్రంరెడ్డి, జిల్లా అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్, నియోజకవర్గ కన్వీనర్ మోహన్‌రెడ్డి, మేడ్చల్ మున్సిపల్ అధ్యక్ష రాలు శైలజాహరినాథ్, మాజీ అధ్యక్షుడు అంజనేయులు, మండలపార్టీ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, నాయకులు ప్రేమ్‌దాస్, శ్రీకాంత్, అర్జున్, ఈశ్వర్, నాగరాజు, మహేందర్‌యాదవ్, మహేష్, బాబు రాజు, యువజన కాంగ్రెస్‌నేత రాహుల్‌యాదవ్, కొమురయ్యాయాదవ్, యాదవ సంఘం సభ్యులు, వివిధపార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్‌లోని పాఠశాలలో ఏఐ కంప్యూటర్ ల్యాబ్



పాఠశాలలో ఏర్పాటు చేసిన ఏఐ కంప్యూటర్ ల్యాబ్

**మేడ్చల్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**
మేడ్చల్‌పట్టణంలోని మండలపరిషత్ ప్రాథమికపాఠశాలలో ఎఫ్‌ఎల్‌ఎన్ ఏఐ కంప్యూటర్‌ల్యాబ్‌ను ప్రారంభించారు. విద్యార్థుల్లో ప్రగతి సాధించడం కోసం పైలెట్‌ప్రాజెక్ట్ కింద ఈల్యాబ్ ప్రారంభించడం జరిగిందని, ఈల్యాబ్ లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా పిల్లలకు చదవడం, రాయడం నేర్పించడం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంఈఓ రంగాచారి, జిల్లాపరిషత్ బాలికల ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దళితవాడల ప్రజల రాకపోకలకు అడ్డుగా ఉన్న కాలనీ ప్రహరీగోడలను కూల్చాలి

**-ఫిర్యాదు చేసిన దళితసమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు బిఎన్.రాంమోహన్**



మున్సిపల్ మేనేజర్ శ్రావణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేసిన దళితసమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు బిఎన్.రాంమోహన్

**శామీర్‌పేట, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**
దేవరయాంజాల్‌లో దళితవాడ (13వ వార్డులో) ప్రజలు రాకపోకలు జరపకుండ తిరుమలకాలనీ వారు ప్రహరీగోడను నిర్మించారని, హైడ్రా అధికారుల బృందం సందర్శించి రెండుచోట్ల మాత్రమే కూల్చారని, మిగతా ఆరుచోట్ల అడ్డుగా ఉన్న వాటిని కూల్చకుండ వదిలేశారని వెంటనే వాటిని కూడ సంబంధిత అధికారులు కూల్చివేసి దళితవాడ ప్రజలకు న్యాయం చేయాలని దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు బిఎన్.రాంమోహన్ డిమాండ్ చేశారు. సోమవారం శామీర్‌పేటమండలం తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో ఆయనతో పాటు పలువురు నాయకులు ర్యాలీగా విచ్చేసి మున్సిపల్ మేనేజర్ శ్రవణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం (ఫిర్యాదు)ను అందజేశారు.

దేవరయాంజాల్ పరిధిలో ఉన్న 13వ వార్డు దళితవాడ ప్రజలు రాకపోకలు జరపకుండ తిరుమలకాలనీ వారు ప్రహరీగోడను నిర్మించారని ఈ విషయంపై హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తే ఇటీవలనే హైడ్రా అధికారుల బృందం సందర్శించి రెండు చోట్ల రోడ్లకు అడ్డుగా ఉన్న ప్రహరీగోడలనుకూల్చారని, అయితే కాలనీవాసులు అడ్డుకోవటంతో మిగతా ఆరు చోట్ల ప్రహరీగోడలను కూల్చకుండ వదిలేశారని వెంటనే వాటిని కూడ కూల్చివేయాలని ఆయన డిమాండ్ చేశారు. అవసరమైతే ఇరువైపుల వారిని సంబంధిత అధికారులు పిలిపించి చర్చలుజరిపి వాటిని కూడ కూల్చివేయటానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను, మేనేజర్‌ను కోరటం జరుగుతుందన్నారు.

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగం ప్రకారం దళితవాడ ప్రజలకు రాకపోకలు, నడిచే స్వేచ్ఛ లేకుండ అడ్డుకుంటున్నారని ఇకనైనా అధికారులు సందర్శించి పరిశీలించి దళితవాడ ప్రజలకు న్యాయం చేయాలని రోడ్లకు అడ్డుగా ఉన్న ప్రహరీగోడలను కూల్చాలని ఆయనతోపాటు పలువురు నాయకులు కోరారు. ఈ కార్య క్రమంలో రాష్ట్ర అధ్యక్షులు బిఎన్ రాంమోహన్‌తో పాటు నాయకులు ఎన్.ప్రకాశ్, జి.జానకిరాం, టి.మహేందర్, టి.ఈశ్వర్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కీసరగుట్టలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు



యాగశాలలో వేద పండితుల ప్రత్యేక పూజలు

**కీసర, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**
తెలంగాణాలోనే సుప్రసిద్ధ శైవక్షేత్రమైన కీసరగుట్ట శ్రీభవానీరామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం విఘ్నేశ్వర పూజతో ప్రారంభమయ్యాయి. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఆలయ చైర్మన్ తటాకం నారాయణశర్మ దంపతులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ మహామండపంలో విఘ్నేశ్వర పూజానంతరం పుణ్యాహవచనము, రుత్విక్‌వరణం, యాగశాలప్రవేశం, అఖండస్థాపన, సాయంత్రం అగ్నిప్రతిష్ఠాపన, భేరీపూజ, ధ్వజారోహణ, ద్వాత్రింశతి రాగాలాపన, నీరాజన, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం, రాత్రి 8గంటలకు శ్రీ రామలింగేశ్వరస్వామివారు గుట్టనుంచి కీసరకు విచ్చేయుట తదితర కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఫౌండర్, ట్రస్టీలు తటాకం రమేష్ శర్మ, తటాకం ఉమాపతిశర్మ, నాగలింగంశర్మ, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు కోల క్రిష్ణయాదవ్, మండల వర్కింగ్‌ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి, మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**ఆలస్యంగా ప్రారంభమైన క్రీడలు...**
ప్రతిసంవత్సరం కీసరగుట్టలో నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల క్రీడోత్సవాలు సోమవారం మధ్యాహ్నం అయినా ప్రారంభం కాలేదు. తెలంగాణరాష్ట్ర స్పోర్ట్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శివచరణ్‌రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పొన్నం తరుణ్‌గౌడ్‌లు ముఖ్యఅతిథులుగా వస్తారని తెలిపినా వారు సమయానికి రాకపోవడంతో మధ్యాహ్నం అయినా క్రీడలు ప్రారంభించలేదు. దీంతో విద్యార్థులు ఎండలోనే నిల్చోవాల్సి వచ్చింది. విద్యార్థులను ఎండలో నిల్చోబెట్టి సమయానికి రావాల్సిన ముఖ్య అతిథులు రాకపోవడంతో భక్తులు, విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు.

**ఆలయంలో నేటి పూజా కార్యక్రమాలు...**
కీసరగుట్ట బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 25వ తేదీ (నేడు) 9 గంటలకు రుద్రస్వామకార హోమం, 4గంటలకు జ్వాలార్చన, రాత్రి 9గంటలకు ప్రదోషకాల పూజ, హారతి, రాత్రి 10గంటలకు శ్రీభవానీరామలింగేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయి.

# కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో సమస్యల వెల్లువ

**-అందిన 64ఫిర్యాదులు..సమస్యలు పరిష్కరించాలి**
**-మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి**



ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా అదనపుకలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ, అధికారులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**
మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డిని కలిసి విన్నవించారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం జరుగగా ప్రజల నుంచి 64ఫిర్యాదులు అందినట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. దీనిలో వివిధ ప్రాంతాల ప్రజలు పలు సమస్యలను వివరిస్తూ ప్రజావాణిలో గోడును విన్నవించారు. బోడుప్పల్‌లోని పిఎన్ఆర్, బిఎల్ నగర్ కాలనీల్లోని ప్రభుత్వ స్థలంలో గత బిఆర్ఎస్‌ప్రభుత్వం ఆరోగ్యకేంద్రంలో కోసం స్థలాన్ని కేటాయించి నిర్మాణం చేపట్టాలని భావించిందని స్థానికులు పేర్కొన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరోగ్య కేంద్రం నిర్మించాలన్న స్థలంలో ఆరోగ్యకేంద్రం నిర్మించకుండ ఆస్థలంలోనే 33/11కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించాలని భావిస్తుందని, కాలనీలుగ ఉన్న ప్రాంతంలో విద్యుత్‌సబ్‌స్టేషన్‌ను నిర్మించవద్దని ఆయా కాలనీలప్రజలు ప్రజావాణిలో ఫిర్యాదుచేసి ఆందోళన వ్యక్తంచేశారు. జిల్లాకలెక్టర్, అదనపుకలెక్టర్ స్పందించి విచారణ జరిపించారు. ఆస్థలం వర్షాలుకురిస్తే నీరునిలుస్తుందని దీనిలో విద్యుత్‌సబ్‌స్టేషన్‌ను నిర్మించాలని భావించటం ఎంత వరకు సబబు అని వెంటనే హాస్పిటల్‌ను నిర్మించేలా తగుచర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. అదేవిధంగా జవహర్‌నగర్ వాసులు మురికికాలువ నిర్మాణంకోసం కందకాలుతీసి రెండునెలలు కావస్తున్నా ఇంతవరకు మురికికాలువ నిర్మాణపనులు చేపట్టటం లేదని, తీసిన కందకాలు ప్రమాదకరంగా ఉన్నట్లు వెంటనే నిర్మాణ పనులు చేపట్టేలా చూడాలని లేదా ఆకందకాలను పూడ్చివేయాలని పలువురు మహిళలు కలెక్టరేట్‌కు విచ్చేసి ఆందోళన వ్యక్తంచేసి ప్రజావాణిలో జిల్లా అదనపుకలెక్టర్‌కు విన్నవించారు. అదేవిధంగా వివిధశాఖలకు సంబంధించి జిల్లావ్యాప్తంగా పలుఫిర్యాదులు అందినట్లు వాటినిపరిశీలించి జిల్లా సంబంధిత అధికారులు వాటిని పరిష్కరించాలని అదనపుకలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశించారు. దీనిలో పలువురు జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించిన ట్రైనీ కలెక్టర్

**దోమ, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల బొంపల్లిలో 3వ నుండి 5వ తరగతుల విద్యార్థులకు సాంకేతిక విద్యను అభ్యసిం చుటకు గాను ఎఐ (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్)డిజిటల్ తరగతుల బోధనను కంప్యూటర్ ల్యాబ్‌ను సోమావారం వికారాబాద్ జిల్లా ట్రైఈ కలెక్టర్ ఉమాహారతి ప్రారంభించారు. ప్రభుత్వం రాష్ట్రంలోని ఆరు జిల్లాలలో ప్రతి జిల్లా నుండి ఆరు పాఠశాలలను ఎంపిక చేసి పైలట్ ప్రాజెక్టు కార్యక్రమము ప్రారంభించడం జరిగింది. చదువులో వెనకబడిన విద్యార్థు లను గుర్తించి వారికి కంప్యుటర్ ఆధారంగా సులువుగా నేర్చు కొనుటకు ఎంతగానో దోహదపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎఎస్ఓ రమేష్, మండల విద్యాధికారి ఇ.వెంకట్, ప్రాథమిక పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు ఎండి.షఫీ, ఉన్నత పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, ఎంపిడిఓ నరేందర్, ఆర్ఐ సురేందర్, పంచాయతీ సెక్రటరీ మీనా, స్కూల్ చైర్ పర్సన్ నసీమ, సిఆర్‌పి వెంకటేష్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, యువకులు, విద్యాసంస్థలు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఉమాహారతి

# తెలంగాణ రాష్ట్రాన్ని ఆవిష్కరణల హబ్‌గా...

**ఐటి,ఎలక్ట్రానిక్స్‌ప్రత్యేక ప్రధానకార్యదర్శి జయేశ్‌రంజన్**



ఎల్‌అండ్‌జీన్ థెరఫీకేంద్రాన్ని ప్రారంభించిన ఐటి, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమల, వాణిజ్యశాఖల ప్రధానకార్యదర్శి జయేశ్‌రంజన్ ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ జర్మనీ (చెన్నై) తాత్కాలిక కాన్సుల్ జనరల్ డాక్టర్ కాథ్రిన్ మిసెరా లాంగ్, ప్రతినిధుల దృశ్యం

**శామీర్‌పేట, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**
తెలంగాణరాష్ట్రాన్ని జీవసైన్స్ పరిశోధనలో ఆవిష్కరణలహబ్‌గా మరింత ముందుకుతీసుకువెళ్లటం కీలకఘట్టం అని ఐటి,ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమల, వాణిజ్యశాఖల ప్రత్యేక ప్రధానకార్యదర్శి జయేశ్‌రంజన్ అన్నారు. సోమవారం మేడ్చల్‌జిల్లా శామీర్‌పేటమండలంలోని తుర్కపల్లిసమీపంలో ఉన్న జీనోమ్‌వ్యాలీలోని మిల్టేని బయోటెక్ ఆధ్వర్యంలో భారత్‌లోనే మొట్టమొదటి సెల్ అండ్ జీన్ థెరఫీకేంద్రాన్ని ఆయనతోపాటు ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ జర్మనీ (చెన్నై) తాత్కాలిక కాన్సుల్ జనరల్ డాక్టర్ కాథ్రిన్ మిసెరాలాంగ్‌లు కలిసి ప్రారంభించారు. అయితే దీనిని ప్రారంభించటానికి ఐటి,పరిశ్రమలశాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొనవలసి ఉండగా సిఎం రేవంత్‌రెడ్డి మంచిర్యాలజిల్లాలో పర్యటనకార్యక్రమంఉండటంతో ఆయన ఈకార్యక్రమంలో పాల్గొనలేదు. దీంతో ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఐటి,కమ్యూనికేషన్స్, పరిశ్రమల,వాణిజ్యశాఖల ప్రత్యేక ప్రధానకార్యదర్శి జయేశ్‌రంజన్ మాట్లాడుతూ ఆరోగ్యసంరక్షణ వ్యవస్థను బలోపేతం చేయటంతోపాటు సెల్ జీన్ థెరఫీ రంగంలో విప్లవాత్మక అభివృద్ధికి మార్గం సుగమం చేస్తుందన్నారు. కొత్త ఉద్యోగావకాశాలను సృష్టించనుందని అన్నారు. ఈచర్య పెట్టుబడులను ఆకర్షించటానికి దోహదపడుతుందని, తెలంగాణ జీవసైన్స్ బయోటెక్నాలజీ రంగాల్లో అగ్రగామిగా నిలుపుతుందని ఆయన అన్నారు. ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ జర్మనీ (చెన్నై) తాత్కాలిక కాన్సుల్ జరనల్ డాక్టర్ కాథ్రిన్ మిసెరా లాంగ్ మాట్లాడుతూ హైదరాబాద్ ఎంఐటిసి ప్రారంభం భారత్-జర్మనీల మధ్య బయోటెక్నాలజీ, ఆరోగ్యసంరక్షణరంగాల్లో పెరుగుతున్నసహకారానికి నిదర్శనమన్నారు. ఈకార్యక్రమంలో మిల్టేని బయోమెడిసిన్ ఎండి, బోర్డు సభ్యులు డాక్టర్ టూన్ ఓవర్ సైజన్స్, పలువురు పాల్గొన్నారు.

# అనంతపద్మనాభస్వామి ఆలయాన్ని సందర్శించిన స్పీకర్

**కొత్తూర్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**
అనంతపద్మనాభస్వామి ఆలయాలకు దేశంలోని ప్రముఖపుణ్యక్షేత్రాలైన కేరళ, వికారాబాద్ తర్వాత పెంజర్లగ్రామం స్వయంభు శ్రీదేవిభూదేవిశ్రీ అనంత పద్మనాభస్వామి ఆలయం ఆధ్యాత్మిక అభివృద్ధి సాధిస్తుందని తెలంగాణ శాసనసభస్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు.కొత్తూర్‌మండలంలోని పెంజర్ల గ్రామంలో స్వయంగా వెలిసిన అనంతపద్మనాభస్వామి ఆలయాన్ని సోమవారం స్పీకర్ సందర్శించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, ప్రకాష్‌గౌడ్, ఏఐసిసి నేత చల్ల వంశీచంద్‌రెడ్డిలకు ఆలయ నిర్వాహకులు మాజీ జడ్పిటిసి మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, ఆలయ చైర్మెన్ బెజవాడ అనితారెడ్డిలు ఘనంగా స్వాగతంపలికారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్పీకర్‌కు స్వాగతంపలికారు. గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ, మనదేశంలో శ్రీఅనంతపద్మనాభస్వామి దేవాలయాలు కేరళలోని అనంతపద్మనాభస్వామి ప్రముఖ ఆలయం, వికారాబాద్‌లో అంతటి పుణ్యస్థలం ఉందని, ఇప్పుడు 800ఏళ్ల నాటి స్వయంభు శ్రీఅనంతపద్మనాభస్వామి ఆలయం ఇక్కడవెలవడం ఎంతోగొప్ప విషయమన్నారు.ఈప్రాంతం ఆధ్యాత్మికప్రాంతంగా అభివృద్ధి చెందాలి అని, షాద్‌నగర్ నియోజకవర్గం ఆధ్యాత్మిక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుందని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శ్రీ అనంతపద్మనాభస్వామి ఆలయం పునిర్నిర్మాణ ప్రారంభోత్సవ కార్యక్రమానికి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఏఐసిసి నేత చల్ల వంశీరెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితర భక్తులు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు రావడంపట్ల ఆలయచైర్మెన్ బెజవాడ అనితారెడ్డి శ్రీఅనంతపద్మనాభస్వామి ఆలయ జ్ఞాపికను అందజేసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



అనంతపద్మనాభస్వామి ఆలయాన్ని సందర్శించిన స్పీకర్

## ఎల్లమ్మను దర్శించుకున్న అసెంబ్లీ స్పీకర్

**దుద్యాల్,ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**
మండలంలోని పోలేపల్లి ఎల్లమ్మ బ్రహ్మోత్సవాలలో భాగంగా రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఎల్లమ్మదేవతను దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. పోలేపల్లి రేణుక ఎల్లమ్మ ఆశీస్సులు తీసుకున్నారు. ఈసందర్భంగా అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ, పోలేపల్లి గ్రామం స్వయాన అమ్మమ్మ వారి గ్రామం అని, గత శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎల్లమ్మ దేవతను దర్శించుకున్న సందర్భంగా ఆయనతోపాటే వచ్చి ఎల్లమ్మను దర్శించుకోవాల్సి ఉండేదని, తాను కుంభమేళాలో ఉన్నందువల్ల ఈరోజు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆయన తెలిపారు.

## పోలేపల్లి ఎల్లమ్మ హుండీ లెక్కింపు



ఎల్లమ్మ ఆలయం హుండీని లెక్కిస్తున్న సభ్యులు

**దుద్యాల్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**
జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన పోలేపల్లి ఎల్లమ్మ జాతర బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. బ్రహ్మోత్సవాలకు సంబంధించి గత 20 రోజులనుండి భక్తులు ఎల్లమ్మకు చెల్లించుకున్న వివిధరకాల కానుకలు డబ్బు,వెండి,బంగారములను ఈవో రాజేందర్‌రెడ్డి, చైర్మన్ జయరాములు ఆధ్వర్యంలో ఆలయకమిటీ సభ్యులు లెక్కించారు. హుండీ లెక్కింపు ద్వారా 3,65,534 రూపాయలు నగదు, 1100 గ్రాముల వెండి ఎల్లమ్మ దేవతకు ఆదాయంగా వచ్చినట్లు ఈవో రాజేందర్‌రెడ్డి తెలిపారు. గత సంవత్సరం బ్రహ్మోత్సవాలలో వచ్చిన ఆదాయం కంటే 80,000 రూపాయలు ఎక్కువగా వచ్చినట్లు తెలిపారు.

## శివరాత్రి ఉత్సవాలకు పరమేశ్వరునిగుట్ట ఆలయం



రాతిగుండు కింద శివలింగానికి సాష్టాంగ పూజలు

**కొడంగల్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**
ఆలయంలో దేవుడిముందు నిలిచి చేతులుజోడించి మనస్ఫూర్తిగా మొక్కుతాం. కాని ఇక్కడి ఆలయంలోమాత్రం విచిత్రంగా సాష్టాంగ నమస్కారంచేస్తేగాని దేవుడిదగ్గరకు వెళ్ళలేము. స్వయంభుగా వెలసిన ఈ శివలింగానికి పూజలుచేయాలన్నా హారతి ఇవ్వాలన్నా తలకిందకు వంచక తప్పదు. మొక్కులుచెల్లించాలంటే బోర్లపడుకొని లోపలికి వెళ్ళాల్సిందే. ఇదే ఇక్కడి ఆలయం ప్రత్యేకత. 600ఏళ్ళ క్రితం స్వయంభూగా వెలసిన పరమేశ్వరకొండపై వెలసిన పరమేశ్వర ఆలయం. కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని బొంరాస్‌పేట మండలం నాగిరెడ్డిపల్లి శివారులో వెలసిన మహాపుణ్యక్షేత్రం. ఈ ఆలయానికి జిల్లావాసులతో పాటు రంగారెడ్డి జిల్లా నుంచే కాక కర్నాటకరాష్ట్రం నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తుంది.

**రాతిగుండు కింద శివలింగం...**
అతిపెద్ద రాతిగుండు కింద శివలింగం ఉంది. దీనికి ఒకథ ప్రచారంలో ఉంది. పూర్వం ఈరాతిగుట్టపైనుంచే రాళ్ళనుతరలించే ప్రయత్నంచేయగా రాళ్ళు కదిలేవికావు. దాంతో ప్రత్యేకపూజలుచేసిన రుషులు ఇక్కడ శివుడు కొలువై ఉన్నాడని పేర్కొంటారు. గుట్టపై ఉన్న పెద్దపుట్టను తొలగించగ రాయికింద భాగాన స్వయంగా వెలసిన శివలింగం కన్పించిందని గ్రామస్థులు చెబుతారు. రాతిగుండు ప్రతి ఏడాది కొంతపరిమాణం పెరుగుతుందని గతంలో సాష్టాంగపూజలు చేసేందుకువెళితే వీపుకు రాతిగుండు తగిలేదని అయితే రానురాను ఆరాతిగుండు కొంత పైకి లేవడంతో ప్రస్తుతం సులువుగా ఆలయంలో వెళ్తున్నారని ప్రచారం.

**గుండుపై ఎల్లప్పుడు నీరు...**
రాతితో తొలచిన గుండంలో ఎల్లప్పుడు నీరు నిల్వ ఉంది. ఈనీటితో స్నానం చేస్తే రోగాలు నయం అవుతాయని, కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాఢనమ్మకం. రాతిగుండుపై శివుడు నృత్యంచేయడంమూలంగా గుండుపై కాళ్ళగుర్తులు ఉన్నాయని వాటిపై నడుచుకుంటు శివుడిని పూజిస్తే రుగ్మతలు తొలిగిపోతాయని విశ్వసిస్తారు. ప్రస్తుతం ఇక్కడ భ్రమరాంబ ఆలయాన్ని నిర్మిస్తున్నారు. దేవాలయంలో ప్రతిరోజు పూజలు నిర్వహిస్తూ పెళ్ళిళ్ళు,శుభకారా ్యలు కొనసాగుతాయి.

**శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబు...**
మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని కొడంగల్ పట్టణంలోని పురాతనగాడిబాయి,మహాదేవునిశివాలయాలు ముస్తాబయ్యాయి.బొంరాస్‌పేటమండలంలోని నాగిరెడ్డిపల్లి శివాలయం, తదితర ఆలయాలను శివరాత్రి ఉత్సవాలకు సిద్ధంచేశారు. ఈనెల26న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శివాలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించేందుకు వివిధ ప్రాంతాలనుంచి భక్తులు అధికసంఖ్యలో రాత్రివేళల్లో జాగారంతో శివుని కృపకు పాత్రులవుతారు.

## పరిశోధనాభివృద్ధితో నైపుణ్యాలను పెంపొందించుకోవాలి




మాట్లాడుతున్న తెలంగాణ ఎస్‌టిఈసి కార్యదర్శి పుల్లయ్య

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:**
నేటియుగంలో సాంకేతిక పరిజ్ఞానం కీలకపాత్ర పోషిస్తుందని తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యామండలి కార్యదర్శి ఆర్ఎ.పుల్లయ్య అన్నారు. ఘట్‌కేసర్‌మున్సిపల్ కొండాపూర్‌లోని సంస్కృతి కళాశాలలో సోమవారం 'టెక్టిక్స్-2కె25' సాంకేతికోత్సవం నిర్వహించారు.

రెండురోజుల పాటు జరుగనున్న కార్యక్రమాన్ని పుల్లయ్య ముఖ్యఅతిధిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించి, ప్రసంగించారు. విద్యార్థులు పరిశోధన, అభి వృద్ధి కార్యక్రమాలపై దృష్టిసారించి తమ నైపుణ్యతను పెంపొందిం చుకోవాలన్నారు. సాంకేతికోత్సవంలో పాలిటెక్నిక్ విద్యార్థులకు పరిశ్రమ అవసరాలపై అవగాహనకల్గించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సందర ్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతు లను ఆకట్టుకున్నాయి. దాదాపు 1,400 మంది విద్యార్థులు నమోదు చేసుకొని తమసాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరచుకునేలా 60 ప్రాజెక్టులను ప్రదర్శించారు.ముఖ్యఅతిధి పుల్లయ్యనుసన్మానించి జ్ఞాపికను అందజేశారు.

ఈకార్యక్రమంలో కళాశాల డైరక్టర్ డాక్టర్ మల్లాది రమాకాంత్‌రెడ్డి, ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జానకీరాములు, ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రవణ్‌కుమార్, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ కె.శివకేశవరెడ్డి, కన్వీనర్ జె.మోహన్, అధ్యాపకులు, పరిశ్రమ నిపుణులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.